





PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu


# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com


తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 09, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజీలు : 8, వెల రూ. 5, బుధవారం - 11 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఆస్ట్రియా స్కూల్లో కాల్పులు... 10 మంది మృతి

గ్రాజ్ నగరంలోని ఓ పాఠశాలలో కాల్పుల ఘటన

కనీసం 10 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు




నిందితుడైన విద్యార్థి స్కూల్ టాయిలెట్‌లో కాల్చుకుని ఆత్మహత్య

మృతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నట్లు ఓఆర్ఎఫ్ కథనం

## 11 ఏళ్ల ప్రస్థానంలో సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి

ప్రజలే కేంద్రంగా పాలన




ప్రపంచంపైనా బలమైన ముద్ర వేశాం: మోదీ

జవాబుల్ని దాటవేస్తున్నారని కాంగ్రెస్ ఎద్దేవా

ఓటర్ల జాబితా డేటా అందజేసే

## కచ్చితమైన తేదీని వెల్లడించండి

మహారాష్ట్ర, హరియాణా విషయమై ఈసీని కోరిన రాహుల్ గాంధీ




పారదర్శకత ఈసీ రాజ్యాంగ బాధ్యత: ఖర్గే

ప్రతి ఏడాదీ ఓటర్ల జాబితాను సవరించే కసరత్తు జరుగుతుంది

మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది

## ఏపీ పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..
## సీఎం చంద్రబాబు నేతృత్వంలో కీలక నిర్ణయం

ఏపీ పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

సీఎం చంద్రబాబు ఛైర్మన్, టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కో-ఛైర్మన్

2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన ప్రధాన లక్ష్యం

విశాఖలో టీసీఎస్ కేంద్రం, విమానయాన అభివృద్ధికి టాటాతో చర్చలు

అమరావతిలో సీఐఐ భాగస్వామ్యంతో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్

రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రగామిగా నిలపడంతో పాటు, ఆర్థిక ప్రగతిని వేగవంతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు ఛైర్మన్‌గా, ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ కో-ఛైర్మన్‌గా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. సభ్యులుగా సీఐఐ డీజీ చంద్రజీత్ బెనర్జీ, మిగతా..2లో

# ఖర్గే, రాహుల్ గాంధీలతో ఢిల్లీలో సీఎం రేవంత్ మంతనాలు

## మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై చర్చ

ఎస్సీ వర్గీకరణ, బీసీ జనగణనపై భారీ సభలకు సన్నాహాలు

మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధిష్ఠానం సూచన




ఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఇటీవల పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టే వారికి శాఖల కేటాయింపు అంశంపై వారితో ముఖ్యమంత్రి చర్చించారు. కొందరు ప్రస్తుత మంత్రుల శాఖలలో కూడా మార్పులు ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది. దీనిపైనా, ఇతర కీలక అంశాలపైనా ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో మంత్రివర్గ కూర్పుతో పాటు రాష్ట్రంలో పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలపైనా విస్తృతమైన చర్చలు జరిగాయి. ముఖ్యంగా, రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అంశాలపై రెండు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ సభలకు సంబంధించిన తేదీలను త్వరగా ఖరారు చేయాలని, వాటికి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని ఆహ్వానించారు. తెలంగాణలో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు వంటి అంశాలపై కాంగ్రెస్ అధినాయకత్వం ముఖ్యమంత్రికి పలు సూచనలు చేసింది. ముఖ్యంగా, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, పాలనా వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దిశానిర్దేశం చేశారు.






## గద్దర్ అవార్డుల మొమెంటో రిలీజ్...

- గద్దర్ ను గుర్తు చేసేలా సినీ అవార్డుల జ్ఞాపిక
- జ్ఞాపికను విడుదల చేసిన తెలంగాణ సర్కార్
- ఈ నెల 14న గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం
- హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




## పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం..

- గంజాయి బ్యాచ్‌కి అడ్డుకట్ట వేయాలి: సీఎం చంద్రబాబు
- ఈ విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం
- వంద శాతం మార్పు కనిపించాలి

## 'సంకరజాతి' అంటూ సజ్జల చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఫైర్

- అమరావతి మహిళలపై సజ్జల వ్యాఖ్యలను ఖండించిన షర్మిల
- సజ్జల ఒక మూరు?డిలా మాట్లాడారని తీవ్ర విమర్శ
- సొంత చెల్లికే జగన్ ప్రభుత్వంలో గౌరవం లేదంటూ వ్యాఖ్య



అమరావతి: వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతి మహిళల విషయంలో 'సంకరజాతి' అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. సజ్జల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడుతూ, మహిళలను కించపరిచేలా సజ్జల మాట్లాడటం ఆయన మూర?త్వానికి నిదర్శనమని ఘాటుగా విమర్శించారు. వైసీపీ మిగతా..2లో

# యోగా డే రికార్డు కోసం ప్రపంచమంతా విశాఖవైపు చూస్తోంది!

- విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవంనాడు ప్రపంచ రికార్డు లక్ష్యం
- 5 లక్షల మందితో యోగా కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు
- ఏర్పాట్లపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష, అధికారులకు దిశానిర్దేశం
- ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కి.మీ. మేర యోగా ప్రదర్శన
- పౌరుల సౌకర్యార్థం భారీగా రవాణా, భద్రతా ఏర్పాట్లు పూర్తి
- రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలని లోకేశ్ పిలుపు






అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా ఒక చారిత్రాత్మక ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 21న జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానుండటంతో, ఏర్పాట్లపై రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ అపూర్వ ఘట్టం కోసం యావత్ ప్రపంచం విశాఖ వైపు చూస్తోందని, అధికారులు పూర్తి పట్టుదల, నిబద్ధతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సాగరిక కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒకే ప్రాంతంలో 5 లక్షల మందితో నిర్వహించే ఈ ఈవెంట్ ప్రపంచంలోనే అతిపెద్దదిగా చరిత్ర సృష్టించబోతోంది. ప్రధాని మోదీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం మనందరి బాధ్యత. ఇది రాష్ట్ర ప్రజలందరి కార్యక్రమం, కాబట్టి రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. యోగా వల్ల ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రధాని మోదీ చెబుతున్న విషయాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పకడ్బందీ ఏర్పాట్లు... మిగతా..2లో

ఆర్టీసీ బస్‌పాస్ చార్జీల పెంపు

## ఎమ్మెల్సీ కవిత అరెస్ట్..!

ఆర్టీసీ బస్‌పాస్ ధరల పెంపుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర నిరసన

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ బస్‌భవన్ ముట్టడి

కవితను అరెస్ట్ చేసి చంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

ప్రజలపై ఆర్థిక భారం మోపడమేనని ప్రభుత్వ తీరుపై కవిత విమర్శ

ధరల పెంపుతో ఒక్కొక్కరిపై నెలకు రూ.300 పైగా భారం పడుతుందని ఆవేదన



హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్‌భవన్ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బస్‌పాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. బస్‌భవన్‌ను ముట్టడించి, పెంచిన ధరలను వెంటనే మిగతా..2లో




## మరోసారి.. కేసీఆర్‌తో హరీష్ రావు భేటీ

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి భేటీ అయ్యారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు హరీశ్ రావు హాజరయ్యారు. విచారణ అనంతరం నేరుగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిన ఆయన.. కేసీఆర్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలు, విచారణ తీరుపై కేసీఆర్‌కు వివరించినట్లు తెలిసింది. వీరి భేటీ సుమారు 3గంటల పాటు సాగింది. అయితే, ఇవాళ మరోసారి హరీశ్ రావు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో భేటీ అయ్యారు.




## సీఎం రేవంత్ మరో కీలక నిర్ణయం..

- హైడ్రాకు మరిన్ని బాధ్యతలు
- హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం సర్కారు ఏర్పాటు
- వర్షాకాలంలో నగరంలో వరద ముంపు సమస్యల్ని పరిష్కరించాలి

## కేసీఆర్ విచారణలో కీలక మార్పులు!



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ విచారణలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఓపెన్ కోర్ట్ కాకుండా ఇన్ కెమెరా విచారణ చేసే యోచనలో కమిషన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ ఇన్ కెమెరా విచారణ? చేపట్టనుంది. దీంతో బహిరంగ విచారణకు కేసీఆర్ హాజరు కాకుండా ఇన్ కెమెరా ముందే కమిషన్ విచారణలో కేసీఆర్ పాల్గొననున్నారు. కమిషన్ అడిగే ప్రశ్నలకు ఇన్ కెమెరా సమాధానం చెప్పనున్నారు. ఇప్పటి వరకు కమిషన్ ముందు పాల్గొన్న వారిని ఓపెన్ కోర్టులోనే కమిషన్ విచారించింది. కేసీఆర్‌ను మాత్రం మాజీ సీఎం హోదాలో ఇన్ కెమెరా విచారణకు హాజరయ్యే అవకాశం కల్పించింది. రేపు కమిషన్ ముందు 115 సాక్షిగా కమిషన్ ముందు కేసీఆర్ హాజరు కానున్నారు.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# ఆస్ట్రియా స్కూల్లో కాల్పులు... 10 మంది మృతి

ఆస్ట్రియా: ఆస్ట్రియాలోని రెండో అతిపెద్ద నగరమైన గ్రాజ్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి బోర్గ్ డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సే పాఠశాలలో ఓ విద్యార్థి జరిపిన కాల్పుల్లో పలువురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. అనంతరం నిందితుడైన విద్యార్థి పాఠశాల టాయిలెట్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. పాఠశాల భవనం లోపలి నుంచి తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందింది. ఆస్ట్రియా ప్రభుత్వ ప్రసార సంస్థ ఓఆర్‌ఎఫ్ కథనం ప్రకారం, ఈ కాల్పుల్లో కనీసం 10 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. అయితే, మృతుల సంఖ్యను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. మరణించిన వారిలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఉన్నారని స్థానిక మీడియా తెలిపింది. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా మరణించిన వారిలో ఉన్నాడని గ్రాజ్ నగర మేయర్ ఎల్కే ఖర్ వెల్లడించారు. "డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సేలోని ఫెడరల్ అప్పర్ సెకండరీ పాఠశాలలో ఈ కాల్పులు జరిగాయని" ఆస్ట్రియా పోలీసులు సోషల్ మీడియా ద్వారా ధృవీకరించారు. ప్రజలు ఆ ప్రాంతానికి దూరంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం, పాఠశాలను పూర్తిగా ఖాళీ చేయించి, విద్యార్థులు, సిబ్బంది అందరినీ సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పోలీసులు ఎక్స్ ద్వారా తెలిపారు. గాయపడిన విద్యార్థులకు పాఠశాలకు సమీపంలోని హెల్మట్ లిస్ట్ హాల్ అనే ఈవెంట్స్ వేదిక వద్ద వైద్య సహాయం అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గ్రాజ్ నగరం ఆస్ట్రియాలో ఆగ్నేయ ప్రాంతంలో ఉంది. ఇక్కడ సుమారు 3 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు.

# 11 ఏళ్ల ప్రస్థానంలో సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి

దిల్లీ: తన నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతోపాటు వాతావరణ మార్పులు, డిజిటల్ నవకల్పనలు వంటి అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' (అందరితో కలిసి.. అందరి అభివృద్ధికి.. అందరి విశ్వాసంతో.. అందరి కృషితో) అనేదే తమ పాలనను నిర్దేశించే మూలసూత్రమని చెప్పారు. తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడో విడత పాలనలో తొలి ఏడాది పూర్తిచేసుకోవడం, మొత్తంగా ప్రధానిగా పగ్గాలు చేపట్టి సోమవారానికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయాలను '11 ఏళ్ల సేవ' పేరుతో 'ఎక్స్' ద్వారా ఆయన పంచుకున్నారు. సమూల మార్పుల్ని అత్యంత వేగంగా, భారీ పరిమాణంలో తమ సర్కారు చేసి చూపించిందని తెలిపారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహారధాన్యాలు, 15 కోట్ల మందికి కొళాయి కనెక్షన్లు, పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించడం, దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం వంటివి ఆయన ప్రస్తావించారు. మంత్రిమండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే ఉన్నట్లు తెలిపారు. వీరికి ఈ స్థాయిలో పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని చెప్పారు.

అన్ని రంగాలకు పెద్ద దెబ్బ: కాంగ్రెస్

మోదీ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక రంగానికి, సామాజిక కూర్పునకు పెద్దదెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీకి ప్రభుత్వం నియంతృత్వాన్ని అద్దిందని తూర్పారబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భాజపా–ఆరెస్సెస్ బలహీనపరిచాయని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ విఫలమయ్యాయన్నారు. వర్తమానం గురించి ప్రభుత్వం మాట్లాడటం మానేసి 2047పై కలల్లో విహరిస్తోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవాచేశారు. 11 ఏళ్లలో మార్పు గానీ, జవాబుదారీతనం గానీ లేవని, కేవలం ప్రచారమే జరుగుతోందని విమర్శించారు.

## ఓటర్ల జాబితా డేటా అందజేసే
# కచ్చితమైన తేదీని వెల్లడించండి

దిల్లీ: మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా (డేటా) సమాచారాన్ని అందించాలని ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయించడం ప్రశంసనీయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇదో శుభప్రదమైన తొలి అడుగుగా ఆయన అభివర్ణించారు. అయితే, ఆ సమాచారాన్ని డిజిటల్, మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో అందజేసే కచ్చితమైన తేదీని వెల్లడించాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్‌లో ఈసీని కోరారు. ఈ ఏడాది తొలినాళ్లలో దిల్లీ హైకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు...మహారాష్ట్ర, హరియాణాలలో 2009 నుంచి 2024 వరకు నిర్వహించిన ఎన్నికల ఓటర్ల జాబితాను అందజేయటానికి ఈసీ నిర్ణయం తీసుకుందంటూ మీడియాలో వచ్చిన వార్తాకథనం స్క్రీన్‌షాట్‌ను తన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ జత చేశారు. అయితే, మీడియా కథనంలోని అంశంపై ఈసీ నుంచి అధికారిక ప్రకటన ఏమీ రాలేదు. మరోవైపు... ప్రతి ఏడాదీ ఓటర్ల జాబితాను సవరించే కసరత్తు జరుగుతుందని మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. సవరించిన ఎన్నికల జాబితాలను కాంగ్రెస్ పార్టీ సహా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకూ ఉచితంగా ఇస్తుంటామని తెలిపింది. తొలుత ముసాయిదా జాబితాను, ఆ తర్వాత ఖరారు చేసిన తుది జాబితాను అందజేస్తుంటామని పేర్కొంది. ఇదే విధమైన కసరత్తు 2009, 2014, 2019, 2024లోనూ జరిగిందని వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు–2024కు వినియోగించిన సమగ్ర ఓటర్ల జాబితాలు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రజలందరికీ అందుబాటులో ఉన్నాయని, ఉచితంగానే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. అంతకుముంద%రి%్న జరిగిన ఎన్నికల తుది ఓటర్ల జాబితాలను కూడా జిల్లా ఎన్నికల అధికారి నుంచి నిర్ణీత మొత్తంలో రుసుములు చెల్లించి పొందవచ్చని ఆ పోస్టులో పేర్కొంది.

పారదర్శకత ఈసీ రాజ్యాంగ బాధ్యత: ఖర్గే

మహారాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం స్పందనపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. విపక్ష నేత లేవనెత్తిన ప్రశ్నలు అన్నింటికీ ఈసీ సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. పారదర్శకత అనుకూలాంశం కాదని అది ఈసీ రాజ్యాంగ బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుర్తు చేశారు.

# సీఎం రేవంత్ మరో కీలక నిర్ణయం..



హైదరాబాద్: హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రా చేతికి తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతల్ని అప్పగించింది. వర్షాకాలంలో నగరంలో వరద ముంపు సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. వర్షాకాలంలో వరద ముంపు సమస్యలు ఇపుడు హైడ్రా చూస్తుంది.మన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ జీహెచ్ఎంసీ నుండి హైడ్రాకు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ ఒక గొడుగు కిందకు రావడం వల్ల పని ఈజీ అవుతుంది. వర్షాకాలంలో మాత్రమే హైడ్రా బాధ్యత. వర్షాకాలంలో చేయాల్సినవి హైడ్రా చేస్తుంది. వర్షాకాలం ముందు చేయాల్సినవి జీహెచ్ఎంసీ చేస్తుంది. నాలాల రక్షణ, నాలాల్లో పూడిక తీత లేకుండా చూస్తాం. మొత్తం నగరాన్ని మార్చేస్తాం అని చెప్పను కానీ బెటర్ చేస్తాం. ఇప్పటికే విరిగిపోయి చెట్లను గుర్తిస్తున్నాం. ప్రమాదకర మ్యాన్ హోల్స్‌ను గుర్తిస్తున్నాం. నాలాల్లో వరద నీరు సాఫీగా వెళ్లేలా చేస్తాం. మా దగ్గర 30 టీమ్స్,జీహెచ్ఎంసీ వద్ద దగ్గర 150 టీమ్స్, ట్రాఫిక్ 20 టీమ్స్ ఉన్నాయి. అన్ని టీములు పని చేస్తున్నాయా లేదా చెక్ చేస్తాం. వరద నీరు సరిగా వెళ్లేలా టీమ్స్ పని చేస్తున్నాయా లేదా అని చూస్తాం.ఎంత వర్షం పడుతుందో దాని మీద పరిస్థితి ఆధారపడి ఉంటుంది' అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.

# పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం..



అమరావతి: గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, ఈ విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. వంద శాతం మార్పు కనిపించాలని ఆదేశించారు. అనంతపురం పట్టణంలో ఇంటర్ విద్యార్థిని హత్య, ఏడుగురాళ్లపల్లిలో బాలికపై అత్యాచారం ఘటనలపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేసు పూర్వాపరాలు పూర్తిగా తెలుసుకున్న ముఖ్యమంత్రి.. ఈ కేసుల్లో నిందితులకు వెంటనే శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే విచారణ పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసి ట్రయల్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేక శ్రద్ధతో పక్కాగా ఆధారాలు సేకరించి నిందితులకు అత్యంత కఠిన శిక్షలు పడేలా చూడాలని తెలిపారు. మహిళలపై నేరాల విషయంలో పోలీసుశాఖ కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నేరం చేయాలనే ఆలోచన ఉన్నవారు పోలీసులు తీసుకునే చర్యల గురించి భయపడే పరిస్థితి రావాలన్నారు. ఆడబిడ్డలపై క్షణికావేశంలోనో.. గంజాయి మత్తులోనో...వ్యవస్థీకృతంగానో నేరాలకు పాల్పడే వారికి శిక్ష తప్పదనే అభిప్రాయాన్ని కలిగించాల్సి ఉందని సీఎం అన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు నేరగాళ్లపై నియంత్రణ లేదని, గంజాయి, డ్రగ్స్, చట్టం అంటే భయం లేకపోవడం వల్ల నేరగాళ్లు అదుపులో లేకుండా పోయారని, దీంతో నేటికీ కొందరు పాత అలవాట్లను మానుకోవడం లేదని అన్నారు. సీఎం నిర్వహించిన సమీక్షలో సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్పందించిన జాతీయ మహిళా కమిషన్

అనంతపురం జిల్లాలో యువతి హత్యపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. మీడియా కథనాలను సుమోటోగా తీసుకున్న కమిషన్.. హత్య ఘటనపై ఏం చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక పంపాలని ఏపీ డీజీపీకి లేఖ రాసింది.

# యోగా డే రికార్డు కోసం ప్రపంచమంతా విశాఖవైపు చూస్తోంది!

మొదటి పేజి తరువాయి




పకడ్బందీ ఏర్పాట్లు... ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు

ఈ నెల 21న ఉదయం ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల పొడవున 247 కంపార్ట్‌మెంట్లలో ఈ యోగా కార్యక్రమం జరగనుంది. ఉదయం 6:30 గంటలకు ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద ఉన్న ప్రధాన ప్రాంగణానికి ప్రధాని చేరుకుంటారని, అంతకు గంట ముందే ప్రజలంతా నిర్దేశిత కంపార్ట్‌మెంట్లకు చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. "ప్రజలను వాహనాలనుంచి 600 మీటర్లకు మించి నడిపించవద్దు. వారిని ఇళ్ల నుంచి ప్రాంగణానికి చేర్చడం దగ్గర నుంచి, తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేరే వరకు అధికారులదే బాధ్యత. జూన్ 19, 20, 21 తేదీలు చాలా కీలకం. అధికారులంతా ప్రణాళికాబద్ధంగా, సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని లోకేశ్ స్పష్టం చేశారు. సమావేశానికి ముందు ఏయూ గ్రౌండ్స్‌లో అని లోకేశ్ స్పష్టం చేశారు. సమావేశానికి ముందు ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న యోగా శిక్షణను మంత్రి పరిశీలించారు.

అధికారుల సన్నద్ధతపై కృష్ణబాబు వివరణ

రాష్ట్రస్థాయి నోడల్ ఆఫీసర్‌గా నియమితులైన ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ, 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా జరుగుతున్నాయని తెలిపారు. "ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారిని బాధ్యుడిగా నియమించాం. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని క్యూఆర్ కోడ్ ద్వారా నిర్దేశిత కంపార్ట్‌మెంట్లలోకి అనుమతిస్తాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని రాత్రి 2 గంటల నుంచే అనుమతిస్తాం" అని ఆయన వివరించారు. వాహనాల క్రమబద్ధీకరణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 1200 కెమెరాలను అమర్చినట్లు తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 30 ప్రధాన లోకేషన్లతో పాటు, మరో 18 అదనపు లోకేషన్లలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమ నిర్వహణ కోసం 2 వేల మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లకు బాధ్యతలు అప్పగించామని, వారిని ముందురోజు రాత్రే ఏయూ గ్రౌండ్స్‌కు రప్పిస్తామని కృష్ణబాబు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా 116 అంబులెన్స్‌లను, 1400 బయో టాయిలెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. హాజరయ్యేవారందరికీ మ్యాట్లు, టీషర్టులు ఆయా కంపార్ట్‌మెంట్ల వద్దే అందిస్తామని పేర్కొన్నారు. విశాఖతో పాటు పరిసర జిల్లాల నుంచి ప్రజల కోసం 3,500 ఆర్టీసీ బస్సులు, 8 వేల ప్రైవేటు, స్కూలు బస్సులను సిద్ధం చేశామని, సచివాలయ ఉద్యోగులకు ప్రజల సురక్షిత రవాణా బాధ్యతలు అప్పగించామని ఆయన వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. హరీంద్రప్రసాద్, ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్‌పాస్ చార్జీల పెంపు
# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్..!

మొదటి పేజి తరువాయి



బస్‌భవన్‌ను ముట్టడించి, పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఎమ్మెల్సీ కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కవితను చంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బస్‌పాస్ ధరలు పెంచి సామాన్యులపై తీవ్రమైన భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు, తక్కువ వేతనాలు పొందే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడతారు. ఈ ధరల పెంపుతో ప్రయాణికుడిపై నెలకు సుమారు 300 రూపాయలకు పైగా అదనపు భారం పడే అవకాశం ఉంది" అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటు పడిపోయిందని ఆరోపించారు. అంతేకాకుండా, విద్యార్థుల సౌకర్యార్థం అనేక మార్గాలలో తగినన్ని బస్సులు నడపడం లేదని తమ దృష్టికి ఫిర్యాదులు వస్తున్నాయని కవిత తెలిపారు.

## ఏపీ పారిశ్రామిక ప్రగతికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..
# సీఎం చంద్రబాబు నేతృత్వంలో కీలక నిర్ణయం



సీఎం చంద్రబాబు ఛైర్మన్‌గా, ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ కో–ఛైర్మన్‌గా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. సభ్యులుగా సీఐఐ డీజీ చంద్రజీత్ బెనర్జీ, అపోలో ఆసుపత్రి వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్ల, ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి, సతీశ్ రెడ్డి, జీఎం రావు, ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రమణ్యన్, టీవీఎస్ మోటార్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, సీఎస్ విజయానంద్ ఉండనున్నారు. 'స్వర్ణాంధ్ర ప్రదేశ్ ఆర్థికాభివృద్ధి టాస్క్‌ఫోర్స్'గా నామకరణం చేసిన ఈ బృందం.. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు వ్యూహరచన చేయనుంది. ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సంబంధించి సీఎం చంద్రబాబు గతేడాది ఆగస్టులో టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో భేటీ అనంతరం ప్రకటన చేశారు. 2027 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నది తమ ప్రభుత్వ దార్శనికత అని ఆయన అప్పుడు స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా 2024 నవంబరులో ఈ టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాథమిక లక్ష్యాలు, దృష్టి సారించాల్సిన కీలక రంగాలపై చర్చించారు. ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఈ టాస్క్‌ఫోర్స్.. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తుంది. మౌలిక సదుపాయాల కల్పన, నవ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు చేయూత, తయారీ రంగం అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధానంగా దృష్టి సారిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే విశాఖలో టీసీఎస్ అభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పడానికి, ఎయిర్ ఇండియా, విస్తారా విమానయాన సంస్థల ద్వారా రాష్ట్రంలో విమాన సేవలను మెరుగుపరచడానికి టాటా గ్రూపుతో భాగస్వామ్యం కుదుర్చుకునే అంశాలను కూడా ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోంది.

## 'సంకరజాతి' అంటూ
# సజ్జల చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఫైర్

మొదటి పేజి తరువాయి



ఆయన మూర?త్వానికి నిదర్శనమని ఘాటుగా విమర్శించారు. వైసీపీ పదే పదే తప్పులు చేస్తోందని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల తనపై జరిగిన సోషల్ మీడియా దాడిని కూడా ప్రస్తావించారు. "సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డి సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని నాపై కూడా తీవ్రమైన దుష్ప్రచారం చేశారు. నేను వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెనని, ఒక మహిళనని కూడా చూడకుండా నన్ను కించపరిచారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అందరినీ తన అక్కాచెల్లెళ్లుగా సంబోధిస్తారని, కానీ ఆయన సొంత చెల్లికే కనీస మర్యాద దక్కడం లేదని విమర్శించారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని ఇతర మహిళలను ఆయన ఎలా గౌరవిస్తారని షర్మిల ప్రశ్నించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతల తీరుపై కూడా షర్మిల తన అసహనాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఒక మహాసముద్రంతో పోల్చిన ఆమె, అందులో మంచి వ్యక్తులతో పాటు కొంత చెత్త కూడా ఉంటుందని వ్యాఖ్యానించారు. "పార్టీ అభివృద్ధి పథంలో పయనిస్తుంటే, కొందరు దాన్ని కిందికి లాగే ప్రయత్నం చేస్తున్నారు. వారే పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతున్నారు" అని అన్నారు. పార్టీలో క్రమశిక్షణా కమిటీ ఉందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సొంత పార్టీపైనే దుష్ప్రచారం చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని షర్మిల స్పష్టం చేశారు.

# గద్దర్ అవార్డుల మొమెంటో రిలీజ్...

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం దాదాపు పదకొండేళ్ల తర్వాత నంది అవార్డులను ప్రకటించింది. ఈసారి "గద్దర్ అవార్డులు" పేరుతో అవార్డులను ప్రదానం చేయనున్నారు. రీసెంట్ గానే 2024కు సంబంధించి అవార్డులను అనౌన్స్ చేశారు. అలానే 2014 నుంచి 2023 మధ్య వచ్చిన సినిమాలకు ఉత్తమ చిత్రం విభాగంలో అవార్డులు ప్రకటించారు. ఈ నెల 14న హైటెక్స్ వేదికగా అవార్డుల ప్రధానోత్సవ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా గద్దర్ అవార్డుల జ్ఞాపికను ప్రభుత్వం విడుదల చేసింది. జ్ఞాపికలో చేతికి రీల్ చుట్టుకున్నట్లుగా ఉండి.. పైన చేతిలో డప్పు పట్టుకున్నట్లుగా ఉంది. ఆ డప్పు మీద తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని ముద్రించారు. కాగా గద్దర్ గుర్తుగా డప్పును ముద్రించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సినిమాటోగ్రఫీ శాఖ సంయుక్తంగా ఈ చిహ్నాన్ని రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గతంలో నంది అవార్డుల కంటే ఈసారి ప్రైజ్ మనీని భారీగా పెంచింది తెలంగాణ సర్కార్. అవార్డుల్లో భాగంగా మొత్తం 73 పురస్కారాలను తెలంగాణ ప్రభుత్వం అందించనుండగా.. ఇందుకోసం ప్రభుత్వం రూ. 4.5 కోట్లు ఖర్చు చేయనుందని సమాచారం. ఒక్కో ఉత్తమ చిత్రానికి పురస్కారంతోపాటు రూ. 10 లక్షల ప్రైజ్ మనీ లభించనుంది. అలాగే వ్యక్తిగత అవార్డుల్లోనూ ఒక్కో పురస్కారానికి రూ. 3 నుంచి రూ. 5 లక్షల వరకు చొప్పున నగదు అందనుంది. అలాగే ప్రత్యేక పురస్కారాల్లో ఒక్కో స్మారక అవార్డుకు రూ. 10 లక్షల ప్రోత్సాహక నగదు లభించనుంది. ఈ వేడుకకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సినీ పరిశ్రమ ప్రముఖులు హాజరుకానున్నారు. ఇక 2024 విజేతల వివరాలను పరిశీలిస్తే..

2024 గద్దర్ ఫిల్మ్ అవార్డుల విజేతలు..

2024 బెస్ట్ ఫిల్మ్స్ ఇవే..

మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898ఏడీ, రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్, మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్, ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు, హిస్టరీ – హెరిటేజ్ చిత్రం: రజాకార్, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్, ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్ళు), ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి), ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2), ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు), ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం), ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్), ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్), ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2),

స్పెషల్ జ్యూరీ అవార్డులు..

నటుడు: దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), నటి: అనన్య నాగళ్ల (పొట్టేల్), దర్శకులు: సుజీత్, సందీప్ (క), నిర్మాతలు: ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి (రాజు యాదవ్), స్పెషల్ జ్యూరీ స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2), తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: 'మన సినిమా ఫస్ట్ రీల్' (రెంటాల జయదేవ్).

## ఏపీలో రేషన్ దారులకు మరో ఊరట..!
# మంత్రి కీలక ఆదేశాలు..!

అమరావతి: ఏపీలో రేషన్ పంపిణీ వ్యవస్థను గాడిన పెట్టేందుకు ప్రయత్నిస్తున్న కూటమి సర్కార్ లబ్దిదారులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ముఖ్యంగా రేషన్ పంపిణీకి వినియోగిస్తున్న వాహనాల్ని సైతం పక్కనబెట్టి షాపుల ద్వారానే రేషన్ పంపిణీ చేస్తున్నా ఇంకా సర్వర్ సమస్యలు, ఇతరత్రా కారణాలతో లబ్దిదారులకు అందకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం డీలర్లకు కీలక ఆదేశాలు ఇచ్చింది. తాజాగా ఏలూరులో రేషన్ షాపుల్ని పరిశీలించిన పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ ఆదేశం ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ పంపిణీలో లబ్దిదారుల నిర్ధారణ కోసం బయోమెట్రిక్ పరికరాల్ని వాడుతున్నారు. ఇవి కనెక్ట్ అయి ఉన్న సర్వర్లు పనిచేయడం లేదనే కారణంతో పలు చోట్ల రేషన్ సరుకుల్ని లబ్దిదారులకు ఇచ్చేందుకు డీలర్లు నిరాకరిస్తున్నారు. సర్వర్ పనిచేయడం లేదని చెప్పి వెనక్కి పంపేస్తున్నారు. దీంతో లబ్దిదారులు పలుమార్లు రేషన్ షాపులకు తిరగాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీన్ని గమనించిన మంత్రి నాదెండ్ల మనోహర్ వాటితో సంబంధం లేకుండా రేషన్ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. రేషన్ పంపిణీలో సర్వర్ సమస్యలు ఎదురైనా.. పంపిణీని మాత్రం ఆపొద్దని ఆయన డీలర్లకు ఆదేశాలు ఇచ్చారు. దీనికి ప్రత్యామ్నాయంగా లబ్దిదారుడి ఫొటో తీసుకుని, సంతకం చేయించుకుని రేషన్ ఇచ్చి పంపాలని ఆదేశించారు. అంతే కానీ రేషన్ ఆపేందుకు మాత్రం వీల్లేదన్నారు. దీంతో ఇకపై సర్వర్ సమస్యలతో సంబంధం లేకుండా రేషన్ పంపిణీ చేసేందుకు మార్గం సుగమం కానుంది. ఇప్పటికే డీలర్లు తమ పరిధిలోని రేషన్ లబ్దిదారుల డేటాను నిర్వహిస్తున్నారు. వారి వివరాలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా రేషన్ పంపిణీని మరింత సులభతరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ఇజ్రాయెల్‌కు ఇరాన్ అత్యున్నత
# భద్రతా మండలి తీవ్ర హెచ్చరిక



రాన్: రాన్‌పై సైనిక దాడికి పాల్పడితే ఇజ్రాయెల్‌లోని 'రహస్య అణు కేంద్రాలను' తక్షణమే లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ సాయుధ దళాలు హెచ్చరించాయి. ఈ మేరకు ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి తాజాగా ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన 'సున్నితమైన నిఘా సమాచారం' తమకు లభించిందని ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో ఈ తాజా హెచ్చరిక ప్రాధాన్యతను సంతరించుకుంది. నిఘా వర్గాల ద్వారా సేకరించిన సమాచారంతో ఇజ్రాయెల్‌లోని కీలక లక్ష్యాలను గుర్తించామని ఎస్ఎన్ఎస్‌సీ తెలిపింది. ఇరాన్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ ఏదైనా సైనిక చర్యకు దిగితే, ఈ లక్ష్యాలపై ప్రతీకార దాడులు చేయడానికి తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. "శత్రు దేశాల నుంచి వస్తున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కోవడానికి, అలాగే ఇరాన్ నిరోధక సామర్థ్యాలను బలోపేతం చేయడానికి చేపట్టిన విస్తృత వ్యూహాత్మక చర్యలలో ఇది ఒక భాగం" అని ఆ మండలి వివరించింది.ఇరాన్ అణు మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ దాడి చేస్తే, ఇజ్రాయెల్ నిఘా సమాచారం ఆధారంగా అక్కడి 'రహస్య అణు స్థావరాలను' వేగంగా లక్ష్యంగా చేసుకోవడానికి వీలు కలుగుతుందని ఎస్ఎన్ఎస్‌సీ స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఇరాన్ ఆర్థిక లేదా సైనిక ఆస్తులపై జరిగే దాడులకు కూడా తగిన రీతిలో ప్రతిస్పందించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఆ మండలి పేర్కొంది.ఇజ్రాయెల్ అణ్వాయుధాలను కలిగి ఉందని చాలా మంది నమ్ముతున్నప్పటికీ, ఆ దేశం ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడం గానీ, తిరస్కరించడం గానీ చేయలేదు. చాలాకాలంగా వ్యూహాత్మక సందిగ్ధత విధానాన్ని ఇజ్రాయెల్ అనుసరిస్తోంది. జిన్హువా వార్తా సంస్థ ఈ వివరాలను అందించింది.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఘనంగా మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



హుజురాబాద్ – ప్రభాత సూర్యుడు: మానకొండూరు శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ 60వ జన్మదిన వేడుకలను హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల అరవింద్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రానున్న రోజుల్లో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చల్లూరి విష్ణువర్ధన్, మేకల రాజ్ కుమార్, సందీప్, నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ రేవంత్, యూత్ కాంగ్రెస్ సభ్యులు సంపత్, రామ్మోహన్, సాయి, బన్నీ సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలి

**– సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్**



అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం పెంచిన బస్ టికెట్ చార్జీలు మరియు విద్యార్థుల బస్ పాస్ చార్జీలను 20 శాతం పెంచటం వలన పేద విద్యార్థుల కుటుంబాలపై తీవ్ర భారం పడుతుందని అన్నారు. తద్వారా ఉచిత బస్సు పాసులు కనుమరుగయ్యే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే ఎన్నికల హామీలు మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు సౌకర్యం లాగానే కేజీ నుండి పీజీ వరకు చదువుకుంటున్న ప్రతి ప్రతి ఒక్క విద్యార్థికి కూడా వర్తించేలా ప్రభుత్వం కార్యచరణ రూపొందించాలని కోరారు. పెంచిన బస్ చార్జీల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు .రఘు



ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): ఏటూరు నాగారం మండలం దొడ్ల కొత్తూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభిమాన నాయకుడి కార్యకర్త ఏం డీ యూసుబ్ ఖాన్ ఇటీవల అనారోగ్యంతో చనిపోగా దొడ్ల కొత్తూరు గ్రామం పోయి బాధిత కుటుంబని పరామర్శించి 50 కేజీల బియ్యం మరియు 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు ఎండి ఖలీల్ ఖాన్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వినయ్ జిల్లా యూత్ కార్యదర్శి ఎండి గౌస్ సొసైటీ డైరెక్టర్ వంగపండ్ల రవి షాపుల గ్రామ కమిటీ అధ్యక్షులు కుక్కల రామయ్య చిన్నవేయినపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు కుంభం రాజేష్ దొడ్ల కొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షులు తిప్పనపల్లి రవీందర్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## మంత్రి సీతక్క ఆదేశాలతో కొండాయి జంపన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలించిన మండల కాంగ్రెస్ నాయకులు



ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): ఏటూరు నాగారం మండలం దొడ్ల జంపన్న వాగు పై మంత్రి సీతక్క ఆదేశాలతో ఏటూరు నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు మరియు కార్యకర్తలతో నిర్మాణ పనులను పరిశీలించారు. 2022 లో వచ్చిన బారి వరదల కారణంగా ఇంతకు ముందు నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా కట్టుకు పోవడం జరిగింది . కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పడ్డాక మంత్రి సీతక్క ఇంజనీర్స్ తో పూర్తిగా అధ్యయనం చేయండి ఎతైన బ్రిడ్జి కి పదహారు కోట్లతో మంజూరు చేయించి వచ్చి మేడారం జాతర వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఇట్టి పనులను ఏటూరు నాగారం మండల కాంగ్రెస్ బృందం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు మాజీ సర్పంచి చేల వినయ్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆడేపు వెంకటేష్ - నవ్య దంపతుల కుమారుడు చి భువన్ యాదవ్ కి పుట్టు వెంట్రుకలు వేడుకకు హాజరైన మండల బిఆర్ ఎస్ మండల నాయకులు..

కూసుమంచి జూన్ 10 : కూసుమంచి మండలం కూసుమంచి గ్రామనికి చెందిన ఆడెపు వెంకటేష్ – నవ్య గార్ల దంపతుల కుమారుడు భువన్ యాదవ్ పుట్టు వెంట్రుకల వేడుకకు హాజరైన మండల బి ఆర్ ఎస్ నాయకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి చి" భువన్ యాదవ్ నీ అక్షింతలు వేసి ఆశీర్వదించిన శుభాకాంక్షలు తెలియజేసిన కూసుమంచి మండల పార్టీ నాయకులు..

ఈ కార్యక్రమంలో వేముల వీరయ్య,అసిఫ్ పాషా, మాజీ డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్,భానోత్ కిషన్, నాయక్, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న, బీసీ సెల.నూకల మల్లయ్య,తంగెళ్ళ బుచ్చి వద్యా బాలకృష్ణ, పడిశాల గోపి, బానోత్ శ్రీను బాబు. దాసరి వెంకన్న,ఆడెపు వీరభద్రం,బారి రమేష్,మందా ప్రసాద్,మందా నాగులు,అర్వపల్లి ఉపేందర్,ఆడెపు సతీష్,మక్కపల్లి రామకృష్ణ ,కట్ల నాగేశ్వరావు,కొక్కిరేణి వీరాస్వామి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ సంఘం పదాధికారుల శిక్షణ కార్యక్రమం...

అనంతగిరి జూన్ 10 : మండల సమైక్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం పదాధికారుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రామచంద్ర రావు హాజరై... మాట్లాడారు. . ప్రభుత్వం గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకు బ్యాంకు నుండి లోన్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలోని మహిళలకు ప్రభుత్వం అందిస్తున్నటువంటి రుణాలను క్లుప్తంగా వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం లక్ష్మి, గ్రామ సంఘం ఓబీలు, సిసిఎస్ లు, ట్రైనింగ్ సీఆర్పీలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కూసుమంచి బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

కూసుమంచి జూన్ 10 : కూసుమంచి మండలం జ్జుజారలావపేట గ్రామ వేల్పుల సైదులు- సైదమ్మ గార్ల కుమారుడు మహేష్ – అఖిల,లను అక్షింతలు వేసి ఆశీర్వదించిన కూసుమంచి మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య అసిఫ్ పాషా మాజీ డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్ మాజీ సర్పంచ్ భానోత్ కిషన్ నాయక్, జిల్లా నాయకులు మల్లిడి వెంకన్న , బీసీ సెల్ నూకల మల్లయ్య,దాసరి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షులు బక్కతట్ల ఉప్పయ్య, నాగండ్ల అప్పారావు బానోత్ శ్రీను,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలి



ఖమ్మం జూన్ 10: ఖమ్మం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని, విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని, నిబంధనలు పాటించని ప్రవేట్ ,కార్పోరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి పిడిఎస్యు ఆధ్వర్యంలో డిఇఓ లేని కారణంగా సూపర్డెంట్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా జార్జిరెడ్డి ఖమ్మం జిల్లా అధ్యక్షులు మందా సురేష్ మాట్లాడుతూ ఈ నూతన విద్యా సంవత్సరం లోనైనా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని,విద్యార్థుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, గతేడాది మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేమిపై చాలా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించాలని కోరుతున్నాము. మరియు విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లు సకాలంలో ఇవ్వకపోవడం వలన విద్యార్థులు అధ్యయనం లో వెనుకపడిపోతున్నారు. కావున పాఠశాలలు ప్రారంభమైన రెండు రోజుల్లో అన్ని సబ్జెక్ట్ ల బుక్స్ అందరికీ ఇవ్వాలని కోరుతున్నాము. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయి. వాష్ రూమ్స్ లలో కూడా వాటర్ సప్లయ్ కాకపోవడం వలన నిరుపయోగంగా ఉంటున్నాయి.కొన్ని చోట్ల అసలే ఉండటం లేదు.తక్షణమే ఈ మౌలిక సమస్య పరిష్కారం చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాము, మరోవైపు ప్రవైట్, కార్పోరేట్ పాఠశాలలో ఫీజులు దోపిడి చేస్తున్నారు. ఫస్ట్ క్లాస్ విద్యార్థులకు ఎంటెన్స్ టెస్టులు నిర్వహిస్తున్నారు. యూనివరిఫామ్స్, షూస్, బెల్ట్ , మెటీరియల్ లు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ఆవరణలోనే అమ్మకాలు చేస్తున్నారు. గుర్తింపు లేని సంస్థలు కూడా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు పాటించని సంస్థలను గుర్తించి రద్దు చేయాలని కోరుతున్నాము. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, మౌళిక వసతులు మెరుగు పరచడం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. వినతిపత్రం ప్రతినిధిబృందం లో జార్జిరెడ్డి పిడిఎస్యు ఖమ్మం జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, నాయకులు,జంపన్న, రాము,చరణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే యాజమానుల పై కేసులు నమోదు కూసుమంచి సహాయ సంచాలకులు బీ.సరిత**





నేలకొండపల్లి జూన్ 10 :కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు బీ.సరిత హెచ్చరించారు. మండల కేంద్రం లోని రైతు వేదిక లో మంగళవారం విత్తన డీలర్లతో సమీక్ష సమావేశం లో ఆమె మాట్లాడారు... డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రికార్డుల ప్రకారం స్టాక్ లేకుంటే స్టాక్ ను సీజ్ చేసి యాజమాని పై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎరువులు కుత్రిమ కొరత సృష్టించే వారిపై శాఖ పరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. రైతులు కొనుగోలు చేసే ప్రతీ వస్తువు కు రశీదు లు తీసుకోవాలని సూచించారు. గ్రామాలకు వచ్చి "విత్తనాలు విక్రయించే వారి పై తమకు సమాచారం అందించాలని సూచించారు. ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణాల వద్ద ధరల పట్టిక ను ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాధికారి యం.రాధ, డీలర్స్ ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వరరావు, ఏఈవో లు అవినాష్, దుర్గాభవాని, శిరీష తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలం లోని వివిధ గ్రామాలలో దుకాణాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.

## అమ్మ మాట...అంగన్వాడీ బాట కార్యక్రమం





నేలకొండపల్లి భూమి 10: అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ప్రభుత్వం విన్నూత కార్యక్రమం ను మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ నెల 10 నుంచి 17 వరకు రోజు చిన్నారులను ఆకర్షించేలా వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు కార్యచరణ ను సిద్ధం చేశారు. తొలి రోజు అంగన్వాడీ కేంద్రంను అలంకరించి, తల్లిదండ్రులు, చిన్నారులకు స్వాగతం పలికారు. మండలం లోని రాజేశ్వరపురం, కోరట్లగూడెం అంగన్వాడీ టీచర్లు ఉమారాణి, బచ్చలకూరి నిర్మల లు మాట్లాడారు...అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడేళ్లు దాటిన పిల్లలను గుర్తించి వారి ఇళ్ల ను సందర్శించి కేంద్రాలలో చేరాలని కోరుతున్నట్లు తెలిపారు. 5 ఏళ్లు దాటిన చిన్నారులను పాఠశాలలో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు. -పోషణ వాటిక, కిచెన్ ఇతరత్రా అభివృద్ధి లబ్దిదారులకు పోషకాహారం పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 17 న సామూహిక అక్షరభ్యాసం చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓట్లకి, ప్రచారానికే మేము పరిమితమా...? హర్హత ఉన్న మాకు ఇల్లు ఇవ్వరా

### ఇళ్ల కేటాయింపులో ఒక్కరిద్దరి నిర్ణయమా...? లేక అర్హతను చూసి నిర్ణయం హ.

### మంత్రిగారు న్యాయం చేస్తారని అర్హులైన వారి ఎదురు చూపులు



కూసుమంచి జూన్ 10 : పేదల సొంతింటి కలను నెరవేర్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు పథకం' అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలో ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇళ్లు పథకంలో దళితులకి కేటాయించిన ఇళ్ల సంఖ్యలో మాలలకి అన్యాయం జరిగిందని, పథకానికి అర్హత ఉన్న కుడా గత ప్రభుత్వంలో మరియు ఇప్పుడు ఉన్న ప్రభుత్వంలో అన్యాయం జరుగుతుందంటూ. ఈరోజు మాల కులస్థులందరు కలిసి క్యాంప్ ఆఫీస్ కి వెళ్లి మంత్రి గారి సహాయకులు శ్రీనివాస రెడ్డి గారికి వినతిపత్రం అందించగా వారు స్పందిస్తూ మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి అందరికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరంపైనే ఎక్కువ దృష్టి పెట్టింది




హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. మిర్యాలగూడలో ఉమ్మడి నల్గొండ జిల్లా అధికారులతో సమావేశం జరిపారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మండలి ఛైర్మన్, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ ఏడాదిలో బడ్జెట్ లో రూ.23 వేల కోట్లు కేటాయించామన్నారు. ఏదో విధంగా ఎస్ఎల్ బిసి ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. ఆగిపోయిన కందమల్ల ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణకు చేసిన అన్యాయం స్పష్టంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కూలిపోయే కాళేశ్వరంపై రూ.94 వేల కోట్లు ఖర్చు పెట్టారని తెలియజేశారు. ఎస్ఎల్ బిసి, దేవాదుల, ప్రాజెక్టులను పూర్తి చేయలేదని విమర్శించారు. పాలమూరు- రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టులను, నెట్టెంపాడు, భీమ ప్రాజెక్టులను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఉచిత సన్న బియ్యంపై రూ. 13 వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్.. 70 శాతం మంది బాధితులు టీడీపీ వాళ్లే



**అమరావతి,:** అక్రమ మైనింగ్ పై మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయంలో ఎన్నో గనులపై జరిమానాలు విధించారని తెలిపారు. ఇక, శోభారాణి మైన్ కు రూ. 32 కోట్ల మేర ఫైన్ విధించారు.. మైన్స్ శాఖ అధికారి నాయక్.. విచారణ చేసి ఆ గనిలో 35 వేల టన్నుల తెల్లరాయి ఉందని నివేదికలో తెలిపారు.. 7 నెలల తర్వాత లక్ష 25 వేల టన్నుల తెల్లరాయి ఉందని నివేదికలో రాశారు.. వీటిని తీసుకు వెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.. ఈ తెల్లరాయిని తీసుకెళ్లడానికి పర్మిషన్ ఇవ్వకపోయినా.. ఇచ్చినట్లు ఎమ్మార్వో చెబుతున్నారు.. గని కాల పరిమితి ముగిసిన తర్వాత అవి ప్రభుత్వ అధీనంలోకి వస్తాయి.. కానీ, ఇలాంటి గనులన్నింటినీ స్వాధీనం చేసుకుని అక్రమ మైనింగ్ చేస్తున్నారని మాజీ మంత్రి అనిల్ ఆరోపించారు. ఇక, ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తుంటే కేసులు కట్టడం లేదు అని అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం కూడా టిప్పర్లతో తెల్లరాయిని తీసుకు వెళుతున్నారు.. కూటమి సర్కార్ ప్రకటించిన కొత్త విధానం ప్రకారం గనుల వద్ద ఉన్న తెల్లరాయి నిల్వలను వేలం వేస్తామన్నారు.. ప్రభుత్వం వేలం వేస్తే రూ.500 కోట్ల దాకా ఆదాయం వస్తుంది.. కొన్ని గనులను అమర్ నాథ్ రెడ్డి నిర్వహిస్తున్నారు.. వీటిని పరిశీలించేందుకు ఎవరినీ అనుమతించడం లేదు.. గనుల వద్ద గూండాలను పెట్టారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ లో భాగంగా పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ చేస్తున్నారు.. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.. వీటన్నిటికీ ఎంపీ వేమిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేమిరెడ్డి తన అనుచరులను మాట్లాడించకుండా తానే సమాధానం చెప్పాలి.. ఎవరు తెల్ల రాయి తీసినా తనకే అమ్మాలని వేమిరెడ్డి భయపెడుతున్నారని మాజీ మంత్రి అనిల్ చెప్పుకొచ్చారు. కాగా, అక్రమ మైనింగ్ ను స్వయంగా వెళ్లి పరిశీలిస్తాను అని వైసీపీ నేత అనిల్ కుమార్ తెలిపారు. గన్నులన్నింటినీ ప్రారంభించక పోతే యజమానుల తరఫున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గనుల్లో అక్రమాలు చేస్తున్న ఎంపీ వేమిరెడ్డిపై ఎందుకు కేసు పెట్టకూడదని ప్రశ్నిస్తున్నాను.. తన కంపెనీ కాకపోతే ఆయన ఎందుకు ఆన్సర్ ఇవ్వడం లేదు.. రూ.15 వందల కోట్ల మేర దోపిడీకి పాల్పడ్డారు.. గతంలోనే చెప్పా.. పే బ్యాక్స్ అందరికీ ఉంటాయని.. క్వార్ట్జ్ డంప్ ను వేలం వేయాలని డిమాండ్ చేస్తున్నా.. ఇలాగే అక్రమంగా మైనింగ్ కొనసాగిస్తే అందరికీ అవకాశం కల్పించాలి.. బడా బాబులకు మాత్రమే అవకాశం ఇవ్వడం మంచిది కాదు.. చేస్తే అందరికీ చేయాలి.. లేకుంటే ఆందోళన చేస్తానన్నారు. గనుల్లో 70 శాతం మంది బాధితులు టీడీపీ వాళ్లే ఉన్నారని అనిల్ కుమార్ యాదవ్ వెల్లడించారు.

## ఎన్నికల డేటాపై డిజిటల్ ఇంటర్‌ఫేస్‌ని డెవలప్ చేసిన ఇసి




న్యూఢిల్లీ : ఓటర్లు, పోల్ అధికారులు, రాజకీయ పార్టీల కోసం ఎన్నికల సంఘం కొత్త డిజిటల్ ఇంటర్‌ఫేస్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 40కి పైగా మొబైల్, మరికొన్ని వెబ్ అప్లికేషన్‌లను అనుసంధానం చేసింది. ఈ డిజిటల్ ఇంటర్‌ఫేస్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలకు ఇసిఐనెట్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని పోల్ ప్యానెల్ ఆదివారం తెలిపింది. ఈ కొత్త ఫ్లాట్‌ఫారమ్ ద్వారా వినియోగదారులపై ఒత్తిడి తగ్గుతుందని పోల్ ప్యానెల్ వెల్లడించింది. బహుళ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, క్రాస్ చెక్ చేయడం, వివిధ రకాల లాగిన్‌లను గుర్తుంచుకోవడం వంటివి వినియోగదారులపై పడే భారాన్ని ఈ కొత్త ప్లాట్‌ఫామ్ తగ్గిస్తుంది. ఇటీవల జరిగిన ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రతిపాదించారు. ఆయన ప్రతిపాదన మేరకు ఈ కొత్త ప్లాట్‌ఫామ్‌ను ఎన్నికల సంఘం అభివృద్ధి చేసింది. ఎన్నికల డేటాను వినియోగదారుల డెస్క్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లకు యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ డేటాను ఎన్నికల సంఘం అధికారి మాత్రమే నమోదు చేస్తారు.


## గాజాలో దాడుల కంటే.. ఆకలిక తట్టుకోలేక చనిపోతున్నవారే ఎక్కువ



గాజా : గాజాపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు పాల్పడుతూనే ఉంది. ఈ దాడుల వల్ల ఇప్పటికే వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. తాజాగా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల వల్ల 40 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. 125 మంది గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రత్వశాఖ తెలిపింది. కాగా, ఇజ్రాయిల్ సైన్యం దాడుల వల్ల మరణించినవారు కొందరైతే.. ఆకలికి తట్టుకోలేక మరెంతో మంది చనిపోతున్నారని మీడియా వెల్లడించింది. ప్రస్తుతం దాదాపు ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు సుమారు 3,500 మంది చిన్నారులు మృత్యువుకు చేరువలో ఉన్నారు. మరోవైపు ఆహార సరఫరాని ఇజ్రాయిల్ సైన్యం అడ్డుకోవడం వల్ల 290,000ల మంది చనిపోవడానికి సిద్ధంగా ఉన్నారని గాజా మీడియా తెలిపింది.

# సైబర్‌కాండ్రియా.. నెట్ వైద్యం

### వైద్యుడు వద్దు, నెట్టే ముద్దు
### సమస్య గోరంత, నెట్ చూపేది కొండంత
### ఆన్‌లైన్‌లో వెతకడం, ఆందోళన పడటం
### పిల్లలూ, యువతలోనే ఎక్కువ
### విజ్ఞత, విజ్ఞానమే ప్రధానం



అన్నింటినీ గూగుల్‌లో వెతకడం అలవాటైపోయిన చాలామంది.. అనారోగ్య సమస్యలకు వైద్యం, మందులను కూడా నెట్‌లోనే వెతికేస్తున్నారు. అంతటితో ఆగకుండా.. దాని గురించి లోతుగా చదివి, తమకు ఏదో పెద్ద జబ్బే వచ్చిందని తెగ ఆందోళన పడిపోతున్నారు. వెతికింది జబ్బో కాదో తెలీదు గానీ.. ఇలా అనవసరంగా వెతకడం మాత్రం పెద్ద జబ్బే. దీనిపేరు సైబర్‌కాండ్రియా లేదా కంప్యూకాండ్రియా. ఇదో విచిత్రమైన వ్యాధి. పిల్లలు, యువతలో ఇప్పుడిది ఎక్కువైపోయింది. పత్రికలూ లేదా మేగజైన్లలోనూ ఆరోగ్య సమాచారాన్ని చదువుతూ ఆందోళన చెందడాన్ని 'హైపోకాండ్రియా'గా చెబితే.. ఇప్పుడు ఇలా ఇంటర్‌నెట్‌లో చదువుతూ ఆందోళన చెందడాన్ని 'సైబర్' కాండ్రియాగా పేర్కొంటున్నారు. ఈ సమస్య ఉన్నవారు.. తమ ఆరోగ్య సమస్యల గురించి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వెతికి.. బాగా లోతుగా చదివి, తమకు ఏదో పెద్ద జబ్బే వచ్చిందని భ్రమ పడుతుంటారు. ఉదాహరణకు ఓ వ్యక్తికి మామూలుగా తలనొప్పి వచ్చిందనుకోండి. ఆన్‌లైన్‌లో వెతికేటప్పుడు దొరికిన సమాచారంలో దాన్ని 'బ్రెయిన్ ట్యూమర్' తాలూకు ఓ మ్యానిఫెస్టేషన్‌గా చదివాక.. తనకూ బ్రెయిన్ ట్యూమర్ లేదా బ్రెయిన్ క్యాన్సర్ ఉందేమోని అనవసరంగా అపోహపడటం, ఆ భయాలతో ఆందోళనపడటం చేస్తుంటారు. ఇలా తమకున్న గోరంత సమస్యను కొండంత చేసుకుంటారు. వైద్యపరిశోధకులైన డాక్టర్ రయెన్ వైట్, డాక్టర్ ఎరిక్ హార్విట్జ్ 2009లో నిర్వహించిన ఓ అధ్యయనంలో.. ఇలా వెతికేవారు కేవలం మామూలు లక్షణాలకే పరిమితం కాకుండా.. అరుదైన, తీవ్రమైన వ్యాధుల తాలూకు పేజీలనూ ఎక్కువగా క్లిక్ చేసినట్టు తేలింది. వీరిలో స్వల్ప లక్షణాలున్నా పెద్ద వ్యాధి ఉందేమో అని ఆందోళన చెందడం సర్వసాధారణమైందని ఆ అధ్యయనవేత్తలు వెల్లడించారు. సెర్చ్ ఇంజిన్ ల లాగ్స్‌ను ఉపయోగించి, 515 మందిపై వీరు ఈ సర్వే నిర్వహించారు.

### పెద్దలూ అతీతులు కారు...

సైబర్ కాండ్రియాకు పెద్దలూ అతీతులు కాదు. ఉదాహరణకు ఓ కొత్త బ్రాండ్ వాషింగ్ పౌడర్ వాడాక ఒంటి మీద అలర్జీ వచ్చినప్పుడు ఇంటర్నెట్‌లో వెదుకుతారు. ఆ లక్షణాలను బట్టి అది లూపస్ లేదా లైమ్ వ్యాధి అని చెబితే దాని గురించి మరింత భయపడతారు. అవసరం లేని పరీక్షలు చేయించడంతో పాటు అవసరం లేని మందులూ వాడతారు. ఇది వారి మానసిక, శారీరక ఆరోగ్యం, వ్యాధి నిరోధక శక్తి మీదా దుష్ప్రభావం చూపవచ్చు. ఆరోగ్య భయం ఎక్కువగా ఉన్నవారు ఇంటర్నెట్‌లో ఆరోగ్య సమాచారం కోసం మరింత ఎక్కువ వెతుకుతారు. ఆ తర్వాత అది వారిలో మరింత ఆందోళనకు దారితీస్తుంది. ఇలా ఇదొక విష వలయంలా కొనసాగుతూ ఉంటుంది.

### కొంత మంచి సమాచారమూ..

ఇంటర్‌నెట్‌లో దొరికే ప్రతి విషయమూ చెడ్డది కాదు. మయో క్లినిక్, కిడ్స్ హెల్త్, నేషనల్ ఇన్స్ స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) వంటి వెబ్‌సైట్లు అందరికీ అర్థమయ్యే రీతిలో నమ్మదగిన ఆరోగ్య సమాచారాన్ని అందిస్తున్నాయి. అవి మంచి వెబ్‌సైట్లే అయినా అందులోని విషయాన్ని చదివి తప్పుగా అర్థం చేసుకుంటే అదీ ప్రమాదమే. అందుకే ప్రతి అనారోగ్య సమస్య గురించీ ఆన్ లైన్లో ఎక్కువసేపు వెతకడం తగ్గించాలి. అది త్వరగా తగ్గకపోతే ముందుగా తమ పెద్దవారికి చెప్పడం లేదా మంచి డాక్టర్ని సంప్రదించాలి. సైబర్‌కాండ్రియా.. ఇప్పుడు కొత్త జనరేషన్‌లో కనిపిస్తున్న సమస్య. చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌తో మనకు ఎంతైనా సమాచారం అందుబాటులో ఉండవచ్చు. కానీ దాన్ని విజ్ఞతతో ఉపయోగించుకోవడం తెలియనప్పుడు ఎదురయ్యే సమస్య ఇది. ఆ విజ్ఞత నేర్పడం తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తెరగాలి.

### వైద్యులపైనా నమ్మకం పోవచ్చు!

సైబర్ కాండ్రియా వల్ల జరిగే మరో ప్రధాన నష్టం ఏంటంటే.. ఇలా ఇంటర్‌నెట్‌లో వెదకడమన్నది వైద్యులపై ఉన్న నమ్మకాన్ని కూడా దెబ్బతీయవచ్చు. ఆన్ లైన్ లో చదివిన దానికి డాక్టర్ చెప్పిన అంశాలు భిన్నంగా ఉంటే, వైద్యుని మాటనూ నమ్మకపోవచ్చు, డాక్టర్‌ను అనుమానించవచ్చు. కొంతమంది డాక్టర్ దగ్గరకు వెళ్లకుండానే "నేనే నిర్ధారణ (సెల్ఫ్ డయాగ్నోస్) చేసుకున్నా" అనేలా ప్రవర్తిస్తుంటారు. ఇది మరింత ప్రమాదకరం. దీనివల్ల ఏమాత్రం ముప్పు కలిగించని ఓ చిన్న సమస్యను పెద్దదిగా భావించడం, పెద్ద సమస్యను చిన్నదిగా భావించడం జరగవచ్చు. నిజానికి ఓ వ్యక్తి తాలూకు పూర్తి వైద్య చరిత్ర (మెడికల్ హిస్టరీ) ఇంటర్‌నెట్‌కు తెలియదు. అలా అది చిన్న జలుబు నుండి క్యాన్సర్ వరకు అన్నింటికీ.. అందరికీ ఒకే రకమైన పరిష్కారాలు చూపిస్తుంది.

### పిల్లలు, యువతలోనే ఎక్కువ


సైబర్‌కాండ్రియా సమస్యకు లోనవుతున్న వారిలో ముఖ్యంగా టీనేజ్ పిల్లలతో పాటు కౌమార యువత (అడాలసెంట్ యూత్) ఎక్కువగా ఉంటున్నారు. తమ సమస్యను బయటకు చెప్పుకోలేనప్పుడు వారు ఇంటర్‌నెట్‌నే ఆశ్రయిస్తున్నారు. పైగా తమకు ఉండే ఉత్సుకతకు తోడుగా ఆ వయసు పిల్లల్లో సహజంగా టెక్నాలజీ వాడకంలో ఉన్న నైపుణ్యాలు వారిని ఇంటర్‌నెట్ వైపునకు మళ్లేలా చేస్తున్నాయి. అయితే అక్కడ లభ్యమయ్యే సమాచారాన్ని ఏమేరకు తీసుకోవాలన్న విజ్ఞతగానీ, విజ్ఞానంగానీ ఆ వయసులో ఉండకపోవడమే వారిని అపార్థాలూ, అపోహల వైపునకు నెడుతోంది. ఉదాహరణకు, స్కూల్ ముగిసేసరికి తాను అలసిపోతుండటాన్ని ప్రస్తావిస్తూ ఓ బాలిక.. అదే విషయాన్ని గూగుల్‌ను అడిగింది. నిజానికి అది మామూలు అలసట మాత్రమే. కానీ గూగుల్ తన సమాచారంలో "ల్యూకేమియా లేదా గుండె సమస్యల వల్ల ఇలా జరగవచ్చు" అనే సమాధానం ఇచ్చింది. దాంతో ఆమె చాలా ఆందోళనకు లోనైంది. నిజానికి ఆమె అలసటకు మరెన్నో మామూలు కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు తగిన నిద్ర లేకపోవడం లేదా మొబైల్ ఎక్కువ సేపు చూడటం వంటివి. కానీ గూగుల్ సమాధానంతో ఆమెలో కొత్తగా గుండె వేగంగా కొట్టుకోవడం, నిద్రలేమి వంటి ఇతర లక్షణాలు కనిపించవచ్చు. వాటి గురించి మళ్లీ వెదికినప్పుడు దొరికే సమాధానాలు ఆ చిన్నారి లేత మెదడును మరింత గందరగోళానికి గురిచేసే ప్రమాదం ఉంది.

### మిడిమిడి జ్ఞానంతో వీడియోలు

ఇటీవలి కాలంలో ఆరోగ్య సమాచారాలకు మంచి వ్యూవర్‌షిప్ ఉండటంతో వీడియోలు, రీల్స్ తయారు చేసే కొందరు రేటింగ్ కోసం తమ మిడిమిడి జ్ఞానంతో ఆందోళన పెంచే అభూత కల్పనలనూ వైరల్ చేస్తుండటంతో 'సైబర్‌కాండ్రియా'కు లోనయ్యేవారి సంఖ్య పెరుగుతోంది.

# ఐఫోన్ భారత్‌లో తయారీ.. అమెరికాలో అమ్మాలి

### మెజార్టీ ఫోన్ల తయారీ ఇక మన దేశంలోనే
### వెల్లడించిన యాపిల్ సీఈఓ టిమ్ కుక్
### 2026 నాటికి అగ్ర రాజ్యానికి 6 కోట్ల యూనిట్లు
### భారత్‌లో ఐఫోన్ల తయారీ సామర్థ్యం పెంపు
### చైనాపై ఆధారపడడం తగ్గించేందుకే నిర్ణయం
### టాటా కొత్త ప్లాంటులో ప్రారంభమైన ఉత్పత్తి
### కొద్ది రోజుల్లో ఫాక్స్‌కాన్ నూతన ప్లాంటులోనూ



ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే మెజార్టీ ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో అమ్మేవి కాకుండా ఇతర దేశాల్లో విక్రయించే ఉత్పత్తులు మాత్రమే అత్యధికంగా చైనాలో తయారవుతాయని స్పష్టం చేశారు. టిమ్ కుక్ నిర్ణయం వెనక కారణాలేంటి? భారీ టారిఫ్‌ల కారణంగా యాపిల్ కంపెనీ నెమ్మదిగా చైనాతో తెగతెంపులు చేసుకుంటోందా? ఈ నిర్ణయంతో మనదేశానికి లాభమేంటి?

### దిద్దుబాటలో కంపెనీ..

ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్ల ఉత్పత్తిలో చైనా వాటా ఏకంగా 75% పైగా ఉంది. ఈ అంశమే ఇప్పుడు యాపిల్‌కు కష్టాలను తెచ్చిపెట్టింది. యూఎస్-చైనా వాణిజ్య యుద్ధం తారాస్థాయికి చేరడమే ఇందుకు కారణం. చైనా నుంచి యూఎస్‌కు దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా 145% సుంకాలు విధించడం.. ఆ తరువాత ప్రతీకార సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్స్‌ను మినహాయించడంతో వీటిపై టారిఫ్ కాస్తా 20%కి వచ్చి చేరింది. టారిఫ్‌ల విషయంలో ప్రస్తుతానికి ఉపశమనం ఉన్నా.. తయారీపై సింహభాగం ఒక దేశంపై ఆధారపడడం ఏమాత్రం శ్రేయస్కరం కాదన్న వాస్తవం యాపిల్‌కు అర్థం అయినట్టుంది. అందుకే చైనాలో తయారీ తగ్గించి భారత్‌పై ఫోకస్ చేసింది. యూఎస్ మార్కెట్‌కు పూర్తిగా భారత్ నుంచే ఐఫోన్లను సరఫరా చేయాలని నిర్ణయించింది. జనవరి-మార్చి కాలంలో రూ.48,000 కోట్ల విలువైన మేడిన్‌ఇండియా ఐఫోన్స్ యూఎస్‌కు ఎగుమతి అయ్యాయి. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో ఎగుమతైన ఫోన్ల విలువ రూ.28,500 కోట్లు. మొత్తం ఐఫోన్స్ తయారీలో గత ఏడాది భారత్ వాటా 20% ఉంది. 2025లో ఇది 25-30 శాతానికి చేరే అవకాశం ఉంది.

### రెండు కొత్త ప్లాంట్లు..

యూఎస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని చైనాకు ప్రత్యామ్నాయ తయారీ స్థావరంగా భారత్‌ను తీర్చిదిద్దే పనిలో యాపిల్ నిమగ్నమైంది. ఈ నిర్ణయం భారత్‌కు లాభించే విషయమే. ఈ క్రమంలో యాపిల్ ఉత్పత్తులను తయారు చేస్తున్న భాగస్వామ్య కంపెనీలూ తమ సామర్థ్యాన్ని విస్తరిస్తున్నాయి. తమిళనాడులోని హొసూర్ వద్ద ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ కొత్త ప్లాంట్‌లో ఐఫోన్ల తయారీ ఇటీవలే ప్రారంభం అయింది. కర్ణాటకలోని బెంగళూరు వద్ద రూ.22,139 కోట్లతో ఫాక్స్‌కాన్‌నిర్మిస్తున్న కేంద్రంలో కొద్ది రోజుల్లో తొలి దశ ఉత్పత్తి మొదలు కానుంది.

### ఐఫోన్స్ ముచ్చట్లు..

2024లో ప్రపంచవ్యాప్తంగా 23.2 కోట్ల ఐఫోన్ల అమ్మకాలు 2024లో దేశంలో ఐఫోన్ల విక్రయాల్లో 35% వృద్ధి. 1.2 కోట్ల ఐఫోన్ల అమ్మకాలు. భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అమ్మకాల విలువ పరంగా అగ్రస్థానంలో ఐఫోన్. 2024-25లో భారత్ నుంచి రూ.1,50,000 కోట్ల విలువైన ఐఫోన్లు ఎగుమతి. 2023-24లో ఇది రూ.85,000 కోట్లు. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో 4.3 కోట్ల యూనిట్ల యాపిల్ ఫోన్లు తయారయ్యాయి.

### వాటా రెండింతలకు..

దేశంలో 2017 నుంచి ఐఫోన్ల అసెంబ్లింగ్ మొదలైంది. 2026 చివరినాటికి భారత్‌లో ఏటా 7-8 కోట్ల ఐఫోన్లు ఉత్పత్తి కానున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అలాగే ఒక్క యూఎస్ కోసమే 6 కోట్ల యూనిట్లను భారత్ నుంచి దిగుమతి చేసుకోవాలని కంపెనీ నిర్ణయించినట్లు సమాచారం. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో 4.3 కోట్ల యాపిల్ ఫోన్లు తయారయ్యాయి. వీటి విలువ రూ.1,87,000 కోట్లు. ఇందులో 80% ఎగుమతులు. ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్ల తయారీలో భారత్ వాటా 18 నెలల్లో రెండింతలకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. కాగా, ఐఫోన్స్‌ను తయారు చేయడానికి చైనా నుండి కీలక యంత్రాలను దిగుమతి చేసుకోవడానికి అనుమతిలో పెరుగుతున్న జాప్యం ఐఫోన్ 17 విడుదలను మాత్రమే కాకుండా.. దేశం నుండి ఫోన్ల ఉత్పత్తిని రెట్టింపు చేయాలనే కంపెనీ ప్రణాళికను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### యాప్ స్టోర్ సైతం..

ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రపంచంలో అతిపెద్దదైన యాపిల్ కంపెనీకి భారత్‌లో ఐఓఎస్ యాప్ వ్యవస్థ 2024లో రూ.44,447 కోట్ల ఆదాయం సమకూర్చింది. యాపిల్‌కు గత ఏడాది అన్ని విభాగాల్లో కలిపి భారత్ సుమారు రూ.2.3 లక్షల కోట్ల ఆదాయాన్ని అందించినట్టు తెలుస్తోంది. భారత్‌లో డెవలపర్లకు అద్భుత అవకాశాలు ఉన్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ గతంలో అన్నారు. ప్రతి వారం సగటున 2.2 కోట్ల మంది ఇండియా యాప్ స్టోర్‌ను వినియోగిస్తున్నారు. 2024లో యాప్ డౌన్‌లోడ్స్ 110 కోట్లకుపైమాటే.

# తెగుతున్న బంధాలు



మెదడు పనిచేసే స్థాయి పెరుగుతోంది. హృదయం స్పందించే స్థాయి తరుగుతోంది. సౌకర్యాలు పెరుగుతున్నాయి. సాంగత్యాలు తగ్గుతున్నాయి. కొత్త కొత్త వస్తువుల ఆవిష్కరణ. మనస్సు విప్పుకోవటం తిరస్కరణ. ఆధునికత ఆకాశన్నంటుతోంటే, అనుబంధాలు అడుగంటి పోతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు.. అనారోగ్యాల దేహాలు. ఆస్తుల విలువలు పెరిగాయి. సంబంధాల మధ్య విలువలు తరిగాయి. వీటికి కారణాలను రెండు వందలయేండ్ల క్రితమే జన్మించిన మహామేధావి మార్క్స్ వివరించాడు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని. ప్రతి చోటా అది సత్యమని రుజువవుతూనే ఉంది. కానీ ఆ రకమైన సంబంధాల నుండి బయటపడే ప్రయత్నం, తపన సరిగా జరగడమే లేదు. ఇంకా అనేక భ్రమలలో కొనసాగడమే దీనికి కారణం. ఆపదో, విపత్తో, దుర్మార్గమో జరిగినప్పుడు మాత్రమే ఏమిటీ దారుణమని విస్మయపడతాం. తర్వాత మరచిపోతాం. కానీ ఎలాంటి అమానవీయ సంబంధాలలోకి మనం నెట్టబడుతున్నామో ఆలోచించం. ఇదిగో ఈ చిన్న సంఘటన. మన పిల్లలలో ఎలాంటి భావనలు పాదుకొల్పుతున్నామో అవగాహన చేయిస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా ఆంగ్ల ప్రశ్నాపత్రంలో 'అమ్మకు నచ్చేవి.. నచ్చని వాటి గురించి రాయమని ఒక ప్రశ్న ఇచ్చారు. దానికి ఆ విద్యార్థిని 'అమ్మకు నచ్చనిది - నాయనమ్మ, తాతయ్య' అని రాయడం జరిగింది. ఎంత స్పష్టంగా ఆ చిన్నారి రాసింది! వృద్ధాప్యంలో తల్లిదండ్రులు, అత్తమామలు ఎంతో భారంగా మారారని, వారి పట్ల ప్రేమ ఎలా ఉన్నదో ఆ విద్యార్థిని ద్వారా అర్థమవుతుంది. మానవ సంబంధాల్లో వచ్చిన మార్పు తెలిపేందుకు ఈ ఒక్క సమాధానం చాలదూ! ఎప్పటి నుంచో మానవ సంబంధాలలో మార్పు వచ్చినప్పటికీ, వ్యక్తం చేయటం, అంత దుర్మార్గంగా ఆచరించడటం తప్పనే భావన ఒకటి ఉండేది. ఇప్పుడలాంటిదేమీ లేదు. కనిపెంచిన తల్లిదండ్రులను సైతం, చూడలేక గెంటివేయటం, చంపివేయడమూ మనం చూస్తున్నాం. జీవితాంతమూ కలిసి ఉంటామని ప్రమాణాలు చేసిన వివాహ సంబంధాలూ తెంచేసుకోటమే కాదు, చంపేసుకోవటమూ చాలా తేలిక వ్యవహారంగా మారిపోయింది. భార్యలను చంపుతున్న భర్తలు, భర్తలనుచంపుతున్న భార్యలు. ఈ మధ్య నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వివాహిత థ్రిల్లర్ సినిమాను తలపించేలా భర్తను ప్రియుడి చేత చంపించి ఆ తర్వాత భర్తపై రసాయనికదాడి జరిగిందని తానే ఫిర్యాదుచేసింది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో ఓ మహిళ తన ప్రియుడితో కలసి భర్తను హత్య చేయించింది. చిత్తూరు జిల్లా పుత్తూరులో కిరాయి హంతకులతో ఓ వైద్యుడు భార్యను హత్య చేయించాడు. భార్యను చంపడానికి సుపారీ ఇస్తాడొకడు. మత్తు మందిచ్చి గొంతు నులుముతాడొకడు. భర్తను చంపడానికి ప్రియుడితో పథకం వేస్తుందొొకరు. ఇలా రోజురోజుకు ఈ మానవ సంబంధాల విధ్వంస చిత్రాలు మన కళ్లెదుట కనిపిస్తూనే ఉన్నాయి. మానవ విలువలు, సామాజిక కట్టుబాట్ల కంటే, శారీరక సుఖాలకు సౌకర్యాలకు ప్రాధాన్యం పెరిగింది. విలాసవంతమైన జీవనం, డబ్బు, ఖరీదైన వస్తువులపట్ల మోజు, అధికారం, ఇతర ప్రయోజనాలే ప్రధానమైపోయాయి. దానికి తోడు సినిమాలు, సీరియళ్లు, సెల్‌ఫోన్లు, మీడియా ప్రభావాలు విపరీతంగా పెరిగాయి. ఆధునిక జీవనశైలి భ్రమల్లోపడి కొట్టుకుపోతున్నారు. కుటుంబాల్లో పర్యవేక్షణ తగ్గడం, సభ్యుల మధ్య సంభాషణలూ కొరవడటం ఆరోగ్య సమస్యలూ కొన్ని కారణాలు. ప్రధానంగా ఆర్థికపరమైన అంశాలే అధిక ప్రభావంగా పనిచేస్తున్నాయి. మనుషుల మధ్య సంబంధాలు వస్తు, సౌకర్యాల బంధాలుగా మారిపోయాయి. ఒక వస్తువును వాడుకొని వొదిలేసే, విసిరేసే పద్ధతిలోనే మనుషులనూ వాడుకొని వొదిలేయటం, లేదా చంపేయటం వరకూ వచ్చేసింది. మన విద్యా వ్యవస్థ కూడా యువతను ఆర్థిక కార్యకలాపాల ప్రాధాన్యంలోకే నెడుతున్నది. ఆదాయాల లేమి, అవకాశాల కొరత కూడా మనుషుల్ని వొత్తిడిలోకి నెట్టి, మానసిక అనారోగ్యానికి గురిచేస్తున్నది. అందుకే కవయిత్రి జరీనాబేగం ఇలా అంటారు. "ఒక సంబంధం, ఇష్టాఇష్టాలకు మధ్య కాదు, ప్రణాళికలకు %-% పథకాలకు మధ్య / ఒక ఒప్పందం బంధాలకి, బంధుత్వాలకి మధ్య కాదు. అవకాశాలకు, అవసరాలకూ మధ్య / ఒక సమైక్యతా భావం %-% కుటుంబానికీ కుటుంబానికీ మధ్య కాదు. డబ్బుకూ హోదాకు మధ్య. / ఒక అవగాహన %-% మనిషికీ మనిషికీ మధ్య కాదు. ఆస్తులకూ అంతస్తులకు మధ్య. / అసలు విలువలు జీవితం నుండి వేరయి, జీవన ప్రమాణాలకే పరిమితమైనపుడు, ఆర్ద్రత కూడా హృదయాన్ని విడిచి, ఆ మనిషిని శుష్క ఎడారిగా మిగులుస్తుంది". మానవ విలువలు కోల్పోయి, మనిషి మనిషి కాకుండా పోయాక, ఎన్ని సమకూరినా ఏం లాభం! ఈ తిరోగమన సమాజాన్ని మార్చడమే మన ముందున్న కర్తవ్యం.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com






## వచ్చే వారం నుంచి ఓపెన్ అవ్వనున్న

# ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓ...

ఇది ఎంత లిస్టింగ్ గెయిన్స్ ని అందించే ఛాన్స్ ఉందంటే.. ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్ మార్గాల ద్వారా ప్రాజెక్ట్స్ ని చేపట్టడంపై దృష్టి సారించే ఎన్టీపీసీ లిమిటెడ్ కి చెందిన రెన్యువబుల్ ఎనర్జీ కంపెనీ అయిన ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓ వచ్చే వారం నుంచి ఓపెన్ అవ్వనుంది.వచ్చే వారం నుంచి ఓపెన్ అవ్వనున్న ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓ...ఇది ఎంత లిస్టింగ్ గెయిన్స్ ని అందించే ఛాన్స్ ఉందంటే..వచ్చే వారం నుంచి ఓపెన్ అవ్వనున్న ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓ...ఇది ఎంత లిస్టింగ్ గెయిన్స్ ని అందించే ఛాన్స్ ఉందంటే..ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) లలో ఇన్వెస్ట్ చేసి మంచి లిస్టింగ్ గెయిన్స్ పొందాలని భావించే స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల కోసం వచ్చే వారం నుంచి మరొక కొత్త మెయిన్ బోర్డు ఐపీఓ ఓపెన్ అవ్వనుంది. ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్ మార్గాల ద్వారా ప్రాజెక్ట్స్ ని చేపట్టడంపై దృష్టి సారించే ప్రముఖ కంపెనీ అయిన ఎన్టీపీసీ లిమిటెడ్ కి చెందిన రెన్యువబుల్ ఎనర్జీ కంపెనీ అయిన ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కి సంబంధించిన ఐపీఓ నవంబర్ 19, 2024 నుంచి సబ్ స్క్రిప్షన్ కోసం ఓపెన్ అవ్వనుంది. ఇక ఈ కొత్త ఐపీఓ నవంబర్ 19 నుంచి ఓపెన్ అయ్యి నవంబర్ 22 వరకు అందుబాటులో ఉండనుంది.స్టాక్స్‌లో లాభాలు పొందడం ఎలా?? ఈ కోర్సుతో ఆ రహస్యం తెలుసుకోండిఈ ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ. 10,000 కోట్లను సమీకరించాలని భావిస్తుంది. ఐపీవో ప్రైస్ బ్యాండ్ ను ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 102 నుంచి రూ. 108 లుగా కంపెనీ నిర్ణయించింది. ఇక ఈ ఐపీఓలో పాల్గొనాలనుకునే పెట్టుబడిదారులు కనీసం 138 షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది, అనగా రూ. 14,904 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోండి. ఈ కంపెనీ షేర్లు నవంబర్ 27న ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీలు అయిన ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్ట్ కానున్నాయి.ఈ ఐపీవో ద్వారా కంపెనీ ఫ్రెష్ ఇష్యూ కింద రూ. 10 ఫేస్ వ్యాల్యూ కలిగిన 92,59,25,926 ఈక్విటీ షేర్లను విక్రయించి రూ. 10,000 కోట్లని పొందాలని భావిస్తుంది. ఇక ఈ ఐపీఓ ద్వారా వచ్చిన ఆదాయాన్ని కంపెనీకి చెందిన అనుబంధ సంస్థ అయిన ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ లో పెట్టుబడులు పెట్టడం కోసం, అలాగే ఇప్పటికే ఉన్న రుణాలను పూర్తిగా లేదా పాక్షికంగా చెల్లించడం కోసం, అదేవిధంగా సాధారణ కార్పొరేట్ అవసరాల కంపెనీ వినియోగించనుంది.ఈ ఐపీఓకి కేఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ రిజిస్ట్రార్ గా వ్యవహరించనుండగా, ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్ సర్వీసెస్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, హెచ్డీఎఫ్సీ బ్యాంకు లిమిటెడ్, నువామా వెల్త్ మ్యానేజ్మెంట్ లిమిటెడ్ ఈ ఐపీఓ బుక్ రన్నింగ్ లీడ్ మ్యానేజర్స్ గా వ్యవహరించనున్నాయి. ఈ ఐపీఓలో క్యూఐబీలకు 75 శాతం వాటాను, అలాగే రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం వాటాను, అదేవిధంగా ఎన్ఐఐలకు 15 శాతం వాటాను కంపెనీ కేటాయించింది.మంచి లిస్టింగ్ గెయిన్స్ అందించే ఐపీఓ కోసం చూస్తున్నారా? అయితే దీనిపై ఒక లుక్కేయండి..మరో 2 రోజుల్లో ఓపెన్ అవ్వనున్న ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్సు కంపెనీ ఐపీఓ.. ఈరోజు గ్రే మార్కెట్ ప్రీమియం ఎంతంటే.. ?వచ్చే వారం నుంచి ఓపెన్ అవ్వనున్న టెక్స్టైల్ ఐపీఓ.. దీని గ్రే మార్కెట్ ప్రీమియం ఎంతంటే..ఇక ఈ ఐపీఓకి సంబంధించిన డేట్స్ ను ఒకసారి పరిశీలిస్తే, నవంబర్ 25 న షేర్లు ఎలాట్మెంట్ జరగనుండగా, నవంబర్ 26 న ఎలాట్మెంట్ వచ్చిన వారి డీమ్యాట్ అకౌంట్ లో షేర్లను క్రెడిట్ చేస్తారు, ఇక నవంబర్ 27 షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్ట్ అవ్వనున్నాయి. ఇక ఈ రోజు ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓకి సంబంధించిన గ్రే మార్కెట్ ప్రీమియం (జీఎంపీ) రూ. 9 లుగా ఉంది. దీని అర్థం ఒకవేళ మీకు ఈ ఐపీఓలో ఎలాట్మెంట్ వచ్చినట్లైతే, మీరు 8 శాతం లిస్టింగ్ గెయిన్స్ ని పొందే అవకాశం ఉంటుంది.


# దిగొస్తున్న బంగారం, వెండి ధరలు

## వరుసగా 5వ రోజు కూడా భారీగా తగ్గిన బంగారం ధర..



13 నవంబర్ 2024 తేదీ నాడు ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణలో 22, 24 క్యారెట్ల బంగారంతో పాటు వెండి ధరల వివరాలను మీకోసం కింద తెలియ చేయడం జరిగింది.ఈరోజు (13-11-2024) హైదరాబాద్ లో ఒక గ్రాము 22 క్యారట్ల బంగారం ధర (%+శీశ్రీ౹ూాతీఱఎవ ుశీఖఎ%) రూ. 7045 గాను, 8 గ్రాముల బంగారం ధర రూ. 56,360 గా ఉంది. అలాగే 10 గ్రాముల (తులం) బంగారం ధర రూ. 70,450 గా ఉంది, ఇక నిన్నటి ధరలతో పోల్చితే ఈ రోజు 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 400 తగ్గింది.స్టాక్స్‌లో లాభాలు పొందడం ఎలా?? ఈ కోర్సుతో ఆ రహస్యం తెలుసుకోండిఇక 24 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే, ఒక గ్రాము ధర రూ. 7685 గాను, 8 గ్రాముల ధర రూ. 61,480 గాను, అలాగే 10 గ్రాముల ధర రూ. 76,850 గా ఉంది, ఇక నిన్నటి ధరలతో పోల్చితే ఈ రోజు 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ. 440 తగ్గింది.అలాగే వెండి విషయానికి వస్తే, ఒక గ్రాము వెండి ధర (%ూఱశ్రీజవతీ౹ూాతీఱఎవ ుశీఖఎ%) రూ. 99.90 గాను , అలాగే 8 గ్రాముల వెండి ధర రూ. 799.20 గాను, అదేవిధంగా 10 గ్రాముల వెండి ధర రూ. 999 గా ఉంది, ఇక నిన్నటి ధరతో పోల్చితే ఈ రోజు వెండి ధర రూ. 1 తగ్గింది.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ఒక గ్రాము 22 క్యారట్ల బంగారం ధర (%+శీశ్రీ౹ూాతీఱఎవ ుశీఖఎ%) రూ. 7045 గాను, 8 గ్రాముల బంగారం ధర రూ. 56,360 గా ఉంది. అలాగే 10 గ్రాముల (తులం) బంగారం ధర రూ. 70,450 గా ఉంది, ఇక నిన్నటి ధరలతో పోల్చితే ఈ రోజు 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 400 తగ్గింది.ఈరోజు కూడా భారీగా పతనం అయిన బంగారం, వెండి ధరలు.. ఈరోజు ఏపీ, తెలంగాణలలో తులం బంగారం ధర ఎలా ఉందంటే..తగ్గినట్లే తగ్గి భారీగా పెరిగిన బంగారం ధరలు.. ఈరోజు ఏకంగా రూ. 600 పెరిగిన 22%ఎ% బంగారం ధర..గుడ్ న్యూస్.. పసిడి పరుగులకు బ్రేక్.. గత 5 రోజులుగా తగ్గుతున్న బంగారం ధరలు..ఇక 24 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే, ఒక గ్రాము ధర రూ. 7685 గాను, 8 గ్రాముల ధర రూ. 61,480 గాను, అలాగే 10 గ్రాముల ధర రూ. 76,850 గా ఉంది, ఇక నిన్నటి ధరలతో పోల్చితే ఈ రోజు 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ. 440 తగ్గింది.అలాగే వెండి విషయానికి వస్తే, ఒక గ్రాము వెండి ధర (%ూఱశ్రీజవతీ౹ూాతీఱఎవ ుశీఖఎ%) రూ. 99.90 గాను , అలాగే 8 గ్రాముల వెండి ధర రూ. 799.20 గాను, అదేవిధంగా 10 గ్రాముల వెండి ధర రూ. 999 గా ఉంది, ఇక నిన్నటి ధరతో పోల్చితే ఈ రోజు వెండి ధర రూ. 1 తగ్గింది.

# భారీ నష్టాల్లో కూడా మంచి లాభాలను అందించే ఛాన్స్ ఉన్న 5 బెస్ట్ స్టాక్స్.. వీటిపై ఒక కన్నేయండి..




దేశీయ ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఛాయస్ బ్రోకింగ్ కి చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన సుమీత్ బగాడియా, అలాగే మరొక ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఆనంద్ రాతికి చెందిన సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ అయిన గణేష్ డోంగ్రే 2 లార్జ్ క్యాప్, అలాగే 2 మిడ్ క్యాప్, అదేవిధంగా 1 స్మాల్ క్యాప్ కేటగిరికి చెందిన మొత్తం 5 స్టాక్స్ కి బై రేటింగ్ తో పాటు టార్గెట్ ప్రైజ్ ను ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ 5 స్టాక్స్ జాబితాలో మొదటిది ఫార్మా సెక్టార్ కి చెందిన ఇన్నోవా క్యాప్ ట్యాబ్ లిమిటెడ్ కాగా, రెండవది బ్యాంకింగ్ సెక్టార్ కి చెందిన ఫెడరల్ బ్యాంకు లిమిటెడ్, మూడవది కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ కి చెందిన బ్లూ స్టార్ లిమిటెడ్, ఇక నాలుగవది బ్యాంకింగ్ సెక్టార్ కి చెందిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, చివరగా ఐదవది పోర్ట్స్ సెక్టార్ కి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ ఉన్నాయి. ఇక ఈ 5 స్టాక్స్ ఈ రోజు ట్రేడింగ్ లో తమ షేర్ హెూల్డర్స్ కి మంచి ప్రాఫిట్స్ ని అందించే అవకాశం ఉందని ఇద్దరు అనలిస్ట్ లు సూచించారు.




### ఇన్నోవా క్యాప్ ట్యాబ్ లిమిటెడ్ :

స్మాల్ క్యాప్ కేటగిరికి చెందిన ఇన్నోవా క్యాప్ ట్యాబ్ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 1010 టార్గెట్ ప్రైజ్ ను ఇస్తున్నట్లు ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఛాయస్ బ్రోకింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుమీత్ బగాడియా తెలిపారు. అలాగే ఈ షేరుకు రూ. 915 స్టాప్ లాస్ ని కూడా సుమీత్ బగాడియా అందించడం జరిగింది. ఇక ఈ కంపెనీ షేరును రూ. 951.55 ధర వద్ద కొనుగోలు చేయాలని కూడా అనలిస్ట్ తెలిపారు. ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో ఇన్నోవా క్యాప్ ట్యాబ్ లిమిటెడ్ షేరు ధర 1.5 శాతం నష్టపోయి రూ. 937 వద్ద ట్రేడ్ అవుతుంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 5350 కోట్లుగా ఉంది.

### ఫెడరల్ బ్యాంకు లిమిటెడ్ :




మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన ఫెడరల్ బ్యాంకు లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 216 టార్గెట్ ప్రైజ్ ను ఇస్తున్నట్లు ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఛాయస్ బ్రోకింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుమీత్ బగాడియా తెలిపారు. అలాగే ఈ షేరుకు రూ. 199 స్టాప్ లాస్ ని కూడా సుమీత్ బగాడియా అందించడం జరిగింది. ఇక ఈ బ్యాంకు షేరుని రూ. 206.77 ధర వద్ద కొనుగోలు చేయాలని కూడా అనలిస్ట్ తెలిపారు. ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో ఫెడరల్ బ్యాంకు లిమిటెడ్ షేరు ధర 1 శాతం నష్టపోయి రూ. 205 వద్ద ట్రేడ్ అవుతుంది. ప్రస్తుతం ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ. 50,260 కోట్లుగా ఉంది.



### బ్లూ స్టార్ లిమిటెడ్ :




మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన బ్లూ స్టార్ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 1850 టార్గెట్ ప్రైజ్ ను ఇస్తున్నట్లు ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఆనంద్ రాతికి చెందిన సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ అయిన గణేష్ డోంగ్రే తెలిపారు. అలాగే ఈ షేరుకు రూ. 1760 స్టాప్ లాస్ ని కూడా గణేష్ డోంగ్రే అందించడం జరిగింది. ఇక ఈ కంపెనీ షేరుని రూ. 1790 ధర వద్ద కొనుగోలు చేయాలని కూడా అనలిస్ట్ తెలిపారు. ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో బ్లూ స్టార్ లిమిటెడ్ షేరు ధర 0.03 శాతం నష్టపోయి రూ. 1787 వద్ద ట్రేడ్ అవుతుంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 36,740 కోట్లుగా ఉంది.

### స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా :

లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 870 టార్గెట్ ప్రైజ్ ను ఇస్తున్నట్లు ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఆనంద్ రాతికి చెందిన సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ అయిన గణేష్ డోంగ్రే తెలిపారు. అలాగే ఈ షేరుకు రూ. 820 స్టాప్ లాస్ ని కూడా గణేష్ డోంగ్రే అందించడం జరిగింది. ఇక ఈ బ్యాంకు షేరుని రూ. 842 ధర వద్ద కొనుగోలు చేయాలని కూడా అనలిస్ట్ తెలిపారు. ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా షేరు ధర 0.10 శాతం లాభపడి రూ. 844 వద్ద ట్రేడ్ అవుతుంది. ప్రస్తుతం ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ. 7,54,000 కోట్లుగా ఉంది.




### అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ :

లార్జ్ క్యాప్ కేటగిరికి చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 1410 టార్గెట్ ప్రైజ్ ను ఇస్తున్నట్లు ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ అయిన ఆనంద్ రాతికి చెందిన సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ అయిన గణేష్ డోంగ్రే తెలిపారు. అలాగే ఈ షేరుకు రూ. 1325 స్టాప్ లాస్ ని కూడా గణేష్ డోంగ్రే అందించడం జరిగింది. ఇక ఈ కంపెనీ షేరుని రూ. 1350 ధర వద్ద కొనుగోలు చేయాలని కూడా అనలిస్ట్ తెలిపారు. ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్ షేరు ధర 0.90 శాతం నష్టపోయి రూ. 1350 వద్ద ట్రేడ్ అవుతుంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 2,91,000 కోట్లుగా ఉంది.

## ఈ రియల్ ఎస్టేట్ పెన్నీ స్టాక్ లో భారీగా పెట్టుబడులు పెట్టిన

# విదేశీ కంపెనీలు.. మీ వద్ద ఈ స్టాక్ ఉందా?

స్మాల్ క్యాప్ కేటగిరికి చెందిన రియల్ ఎస్టేట్ పెన్నీ స్టాక్ అయిన కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ షేర్లు ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో ఏకంగా 4 శాతానికి పైగా లాభపడడం జరిగింది.స్మాల్ క్యాప్ కేటగిరికి చెందిన రియల్ ఎస్టేట్ పెన్నీ స్టాక్ అయిన కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ (%ఖదీజ +శ్రీశీఱ్శ్రీ ూాఱఎ్‌వం%), తమ షేర్ హెూల్డర్స్ కి మంచి లాభాలని అందిస్తుంది. ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో ఈ కంపెనీ షేరు ధర 4 శాతానికి పైగా లాభపడడం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో 5 విదేశీ కంపెనీలు ఈ కంపెనీలో పెద్ద మొత్తంలో వాటాలను కొనుగోలు చేయడం జరిగింది.స్టాక్స్‌లో లాభాలు పొందడం ఎలా?? ఈ కోర్సుతో ఆ రహస్యం తెలుసుకోండిఈ 5 విదేశీ కంపెనీల జాబితాలో బీకాన్ స్టోన్ క్యాపిటల్ వీసీసీ - బీకాన్ స్టోన్, గ్లోబల్ ఫోకస్ ఫండ్, జీల్ గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ ఫండ్, %వీ%7 గ్లోబల్ ఫండ్ పీసీసీ - సెల్ డ్యూక్యాప్ ఫండ్, నోవా గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ ఫండ్ వీసీసీ - టచ్ స్టోన్ ఉన్నాయి. తాజా హెూల్డింగ్స్ డేటా ప్రకారం ఈ 5 విదేశీ కంపెనీలు సెప్టెంబర్ త్రైమాసికంలో ఈ కంపెనీకి చెందిన షేర్లను కొనుగోలు చేయడం జరిగింది. జూన్ త్రైమాసికంలో ఈ 5 విదేశీ కంపెనీల పేర్లు కేబీసీ గ్లోబల్ కి సంబంధించిన వాటాదారుల జాబితాలో లేవు.కంపెనీ షేర్ హెూల్డింగ్ డేటా ప్రకారం, సెప్టెంబర్ త్రైమాసికంలో బీకాన్ స్టోన్ క్యాపిటల్ వీసీసీ - బీకాన్ స్టోన్ మొత్తం 7,20,01,207 ఈక్విటీ షేర్స్ (అనగా 4.21 శాతం) వాటాను, అలాగే గ్లోబల్ ఫోకస్ ఫండ్ మొత్తం 12,65,64,114 ఈక్విటీ షేర్స్ (అనగా 7.4 శాతం) వాటాను, అదేవిధంగా జీల్ గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ ఫండ్ 8.43 శాతం వాటాను, ఇక %వీ%7 గ్లోబల్ ఫండ్ పీసీసీ - సెల్ డ్యూక్యాప్ ఫండ్ కూడా 8.43 శాతం వాటాను, అదే నోవా గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ ఫండ్ వీసీసీ - టచ్ స్టోన్ 8.44 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మరొకవైపు ఈ కంపెనీలో రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య కూడా క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన 2,06,500 నుంచి 2,27,083 కి పెరగడం విశేషం.షేర్ అవుట్ లుక్ ను ఒకసారి పరిశీలిస్తే, ఈరోజు ట్రేడింగ్ సెషన్ లో కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ షేరు ధర ఏకంగా 4.13 శాతం లాభపడి రూ. 2.52 వద్ద ట్రేడ్ అవుతుంది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 2.65 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 1.57 గా ఉంది. గత ఒక వారం రోజుల్లో ఈ షేరు ధర సుమారు 6 శాతం లాభాన్ని,



అలాగే గత నెల రోజుల్లో సుమారు 10 శాతం లాభాన్ని, అదే విధంగా గత ఆరు నెలల్లో సుమారు 33 శాతం లాభాన్ని, అదే గత ఏడాది కాలంలో 15 శాతం లాభాన్ని, ఇక గత ఐదు సంవత్సరాలలో 85 శాతం నష్టాన్ని తమ వాటాదారులకు అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ సుమారు రూ. 659 కోట్లుగా ఉంది.

## రూ. 440 కోట్ల ఆర్డర్ పొందిన సెమీకండక్టర్ స్టాక్..

# వరుసగా అప్పర్ సర్క్యూట్ తాకి 52 వారాల గరిష్ఠం వద్ద ట్రేడింగ్..

ఆర్ఆర్ పీ సెమీకండక్టర్ లిమిటెడ్ షేరు ధర వరుసగా రెండో రోజూ 2 శాతం అప్పర్ సర్క్యూట్ ను తాకింది. ప్రస్తుతం రూ. 91.31 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇదే సరికొత్త 52 వారాల గరిష్ట స్థాయి కూడా కావడం గమనార్హం. కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ. 120 కోట్లుగా ఉంది. ఇన్వెస్టర్లు ఈ స్టాక్ ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబర్చడానికి ముఖ్యమైన కారణముంది.రూ. 440 కోట్ల ఆర్డర్ పొందిన సెమీకండక్టర్ స్టాక్.. వరుసగా అప్పర్ సర్క్యూట్ తాకి 52 వారాల గరిష్ఠం వద్ద ట్రేడింగ్..స్టాక్స్‌లో లాభాలు పొందడం ఎలా?? ఈ కోర్సుతో ఆ రహస్యం తెలుసుకోండిరూ. 440 కోట్ల ఆర్డర్-440-మహారాష్ట్ర పూణె కు చెందిన టెలికాన్ ఇన్ ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ. 439.90 కోట్లు విలువ చేసే ఆర్డర్ ను పొందినట్లు ఆర్ఆర్ పీ సెమీకండక్టర్ వెల్లడించింది. దీంతో ఈ స్టాక్ ఇన్వెస్టర్ల దృష్టిలో పడింది. భారీ ఆసక్తి కనబర్చడంతో షేరు ధర వరస సెషన్లలో అప్పర్ సర్క్యూట్ వద్ద లాక్ అయింది.




### కొత్త విభాగంలోకి ఎంట్రీ

ఈ కంపెనీ సాధారణంగా డయోడ్స్, ట్రాన్సిస్టర్స్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ వంటి సెమీ కండక్టర్ డివైస్ లను తయారు చేస్తుంది. డిజిటల్ చిప్స్ సహా ఇతర ప్రొడక్టులను ఉత్పత్తి చేస్తుంది. అయితే కొత్త సోలార్ పీవీ మాడ్యూల్స్ ను తయారు చేసేందుకు ఆర్డర్ పొందింది. సిలికాన్ క్రిస్టలీన్ పీవీ మాడ్యూల్స్ ను అందించేందుకు టెలికాన్ ఇన్ ఫ్రాటెక్ తో ఒప్పందం కుదుర్చుతుంది. తద్వారా ఈ సెక్టార్ లోకి కూడా ప్రవేశిస్తోంది.


### క్యూ1 ఫలితాలు..

కాగా 2024 జూన్ తో ముగిసిన త్రైమాసికంలో ఆర్ఆర్ పీ సెమీకండక్టర్స్ ఆపరేషన్స్ రెవెన్యూ రూ. 5.11 కోట్లుగా నమోదైంది. లాభం రూ. 1.68 కోట్లుగా ఉంది. అర్నింగ్స్ పర్ షేర్ రూ. 1.19 గా ఉంది. షేరు ధర ప్రస్తుతం రూ. 91.31 వద్ద ట్రేడ్ అవుతోంది. 52 వారాల గరిష్ఠ స్థాయి కూడా ఇదే. 52 వారాల కనిష్ట స్థాయి రూ. 15 గా ఉంది.గమనిక: ఈ కథనం కేవలం సమాచారం కోసం మాత్రమే. స్టాక్ రికమండేషన్ కాదు. విశ్లేషకుల సొంత అభిప్రాయాలను తెలియజేస్తుంది. స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే ముందు నిపుణుల సలహా తీసుకుంటే మంచిది.

Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఏపీలో వర్షాలతో అలర్టయిన ప్రభుత్వం, సహాయ చర్యలపై ఫోకస్





**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. రాష్ట్రంలో తాజా పరిస్థితిపై హోంశాఖ మంత్రి అనిత ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా రాష్ట్రంలో మరో మూడ్రోజుల పాటు భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఇప్పటికే తెలిపింది. కొన్నిచోట్ల ఎండ, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా సోమ, మంగళవారాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవచ్చని తెలిపింది. మరోవైపు రానున్న రెండురోజుల్లో ఉష్ణోగ్రతలు 41.5 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

## ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం..



**హైదరాబాద్, :** తెలంగాణలో ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగించేందుకు కార్మికులు రెడీ అయ్యారు. ఈ నెల 07 నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం అని తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండు పరిసరాలను సందర్శించి, ప్రయాణికులతో ముచ్చటించారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం, సీఎం ఆదేశాల మేరకు 5, 6 తేదీల్లో కార్మికులు ఎప్పుడు వచ్చినా సమస్యలపై చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ సంస్థ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. 10 సంవత్సరాలుగా ఆర్టీసీ నిర్వీర్యం అయిపోయింది. ఇప్పుడిప్పుడే లాభాల బాటలో నడుస్తుంది. కార్మికులు కూడా సహకరించాలి అని కోరారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ముఖ్య ఉద్దేశాల మీద సంస్థ నడుస్తోంది. రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, ఆర్టీసీ ఇప్పుడే ముందుకు వెళ్తున్న తరుణంలో మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు ఇబ్బందికర పరిస్థితులు తేవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

## ఆపరేషన్ కగార్ ఆగదు.
## మావోయిస్టులు ఆయుధాలు వీడాల్సిందే.. లొంగిపోవాల్సిందే



**హైదరాబాద్, :** కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆపరేషన్ కగార్ పై హాట్ కామెంట్స్ చేశారు. ఆపరేషన్ కగార్ ఆగదు మావోయిస్టులు ఆయుధాలు వీడాల్సిందే లొంగిపోవాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. మావోలతో చర్చలు జరిపే ప్రసక్తే లేదు.. నక్సల్స్ హింసలో ఎందరో లీడర్లు చనిపోయారు పోలీసులు చనిపోయారు అప్పుడు చర్చల గురించి.. మావోయిస్టులకు మద్దతుగా కేసీఆర్, రేవంత్ ఎందుకు మాట్లాడలేదు.. మావోయిస్టు పార్టీ నిషేధ సంస్థ వారితో చర్చలు ఉండవు. పాకిస్తాన్ పౌరులను గుర్తించి వెనక్కి పంపే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే వారు కేంద్రంతో సహకరించాలి.. తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కులగణనకి కేంద్ర చేసే గణన కి చాలా తేడా ఉంటది.. ఆరు గ్యారంటీలను అమలు చేయలేక పోయింది రేవంత్ సర్కార్.. తుపాకీ చేతపట్టి అమాయకులను పొట్టనపెట్టుకున్నోళ్లతో చర్చలు ఉండవ్.. మావోయిస్టులను నిషేధించిందే కాంగ్రెస్.. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీసహా ఎంతో మంది నాయకులను మందుపాతరలు పెట్టి చంపినోళ్లు నక్సల్స్.. అమాయక గిరిజనులను ఇన్ ఫార్మర్ల నెపంతో అన్యాయంగా కాల్చి చంపి ఎన్నో కుటుంబాలకు మానసిక క్షోభ మిగిల్చినవాళ్లు మావోయిస్టులు. తుపాకీ వీడనంత వరకు మావోయిస్టులతో చర్చల ఊసే ఉండదు.. కేంద్ర కులగణన నిర్ణయం చారిత్రాత్మకం.. కాంగ్రెస్ విజయమని చెప్పడం విడ్డూరం.. కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణనకు పొంతనే ఉండదు.. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది.. బీసీల జనాభాను తగ్గించి చూపారు.. కాంగ్రెస్ మాయమాటలను జనం నమ్మడం లేదు.. 6 గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని పక్కదోవ పట్టించేందుకే కాంగ్రెస్ డ్రామాలాడుతోంది.. పాస్ పోర్టు లేని విదేశీయులను గుర్తించి పంపిస్తున్నాం.. రోహింగ్యాలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటో చెప్పాలి. శాంతి భద్రతల సమస్యను రాజకీయం చేయడం సరికాదు.. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చినా చర్యలెందుకు తీసుకోవడం లేదు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే.. ఆ రెండు పార్టీలు సిగ్గు లేకుండా మావోయిస్టులతో చర్చలు జరపాలని పోటీలు పడుతున్నారు.. నక్సల్స్ తో మాటల్లేవు మాట్లాడుకోవడాల్లేవ్ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## స్టూడెంట్ల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం.. హరీష్ రావు ఫైర్..



**హైదరాబాద్, :** ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా స్టూడెంట్ల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. డిగ్రీ స్టూడెంట్లకు ఇంకా ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్లు దోచిపెట్టారని.. కానీ స్టూడెంట్లకు మాత్రం ఫీజు రీయంబర్స్ మెంట్ ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. డిగ్రీ స్టూడెంట్లకు రూ.800 కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా 6 లక్షల మంది స్టూడెంట్ల జీవితాలను అగమ్య గోచరంగా మార్చేసిందన్నారు. 'డిగ్రీ ఎగ్జామ్స్ టైమ్ కు నిర్వహించకపోవడంతో.. ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ లా సెట్, పీజీసెట్, ఇతర సెట్ ఎగ్జామ్స్ రాయలేకపోతున్నారు. ఏప్రిల్ లోనే ఎగ్జామ్స్ నిర్వహించాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల స్టూడెంట్లు, యాజమాన్యాలు తీవ్రమైన నిరసన తెలుపుతున్నా ఎందుకు ప్రభుత్వం స్పందించట్లేదు. బీఆర్ ఎస్ హయాంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా రీయంబర్స్ మెంట్ ఆపలేదు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే స్టూడెంట్లను ఇబ్బందుల్లో పడేసింది. డిగ్రీ అడ్మిషన్లు నిలిపేసి కాలేజీలకు తాళం వేసే పరిస్థితి తీసుకొచ్చింది. 17 నెలల్లో 17 పైసలు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నా.. స్టూడెంట్ల జీవితాలకు అతీగతీ లేకుండా పోతోంది. మొన్న అసెంబ్లీలో ఫీజు రీయంబర్స్ మెంట్లు త్వరలోనే ఇస్తామని రేవంత్ ప్రకటించినా.. ఇప్పటికీ అమలు కావట్లేదు. పాలన చేతకాక విద్యార్థులతో ఆడుకుంటే ఊరుకునేది లేదు' అంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు హరీష్ రావు.

# కులగణన: ఆవశ్యకత, సవాళ్లు




భారత దేశంలో కులగణన ఎప్పుడూ ఒక వేడి చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత దేశంలో అన్ని కులాల సమగ్ర గణన జరగలేదు. 1951 నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కలలో కేవలం షెడ్యూల్డ్ కులాలు, తెగల గణాంకాలను మాత్రమే సేకరించి ప్రచురించారు. ఇతర కులాల సమగ్ర గణన ఇప్పటి వరకు జరగలేదు. అయితే 2011లో సామాజిక, -ఆర్థిక కులగణన జరిగింది కానీ దాని ఫలితాలు ఇంకా అధికారికంగా విడుదల కాలేదు. ఇప్పుడు 2025లో జరగబోయే జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కులగణన ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. ఇది ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం పాత జనాభా అంచనాలపై ఆధారపడి ఉంది. కులగణన ద్వారా ప్రతి కులం ఖచ్చితమైన జనాభా సంఖ్య తెలుస్తుంది. ఈ సమాచారం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని మరింత సమర్థవంతంగా, న్యాయంగా పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది. ఏయే కులాలకు ఎంత ప్రాతినిధ్యం అవసరమో గుర్తించి ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అసమానతలను తగ్గించవచ్చు. అంతేకాకుండా కులగణన వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం ప్రతి కులం ప్రత్యేక అవసరాలను గుర్తించి వారికి లక్షిత అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించవచ్చు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన కులాలను గుర్తించడం సులభమవుతుంది. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది. కులగణన వెనుకబడిన కులాల వాస్తవ పరిస్థితిని సమాజానికి తెలియజేస్తుంది. ఇది సమాజంలో వారి స్థానాన్ని మెరుగుపరచడానికి, వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి, వారి సాధికారతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒక బలమైన పునాదిని అందిస్తుంది. చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు. వనరుల కేటాయింపులో కూడా కులగణన కీలకపాత్ర పోషిస్తుంది. వివిధ కులాల జనాభా నిష్పత్తి, వారి అవసరాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాలకు నిధులను మరింత సమర్థవంతంగా కేటాయించగలదు. ఇది ప్రాంతీయంగా కులాల వారీగా ఉన్న అభివృద్ధి అంతరాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కులగణన డేటా సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, ఇతర పరిశోధకులకు కుల వ్యవస్థ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడానికి, వివక్ష మూలాలను గుర్తించడానికి సమర్థవంతమైన పరిష్కారాలను సూచించడానికి, ఒక విలువైన వనరుగా ఉపయోగపడుతుంది. ఇది విధాన రూపకర్తలకు ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. భారత దేశం విశాల జనాభా, భౌగోళిక వైవిధ్యం కారణంగా సమగ్రమైన కులగణన నిర్వహించడం ఒక పెద్ద సవాలు. దేశంలో వేల సంఖ్యలో కులాలు, ఉపకులాలు ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా వర్గీకరించడం ఒక పెద్ద సమస్య. ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సామాజిక స్థానాలు కలిగిన కులాలు ఉండవచ్చు. దీనికి స్పష్టమైన, ప్రామాణికమైన వర్గీకరణ మార్గదర్శకాలను అభివృద్ధి చేయడం అవసరం. భాషా, ప్రాంతీయ వైవిధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైతే సాంకేతికతను ఉపయోగించి డేటాను విశ్లేషించాలి, నిపుణుల సలహాలు తీసుకోవాలి. కాలక్రమేణా వ్యక్తులు, సమూహాలు తమ కుల గుర్తింపును మార్చుకునే అవకాశం ఉంది. రిజర్వేషన్ల కోసం లేదా సామాజిక ఉన్నతి కోసం ఇలా జరగవచ్చు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రజల నుండి నేరుగా వారి కుల వివరాలను అడగడం, స్వీయ గుర్తింపును ప్రామాణికంగా తీసుకోవడం ఉత్తమం. డేటా సేకరణలో పక్షపాతం కూడా ఒక ముఖ్యమైన సవాలు. గణన సిబ్బంది వారి వ్యక్తిగత నమ్మకాలు లేదా అంచనాల ఆధారంగా తప్పుగా డేటా నమోదు చేసే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి సిబ్బందికి కులం సున్నితత్వాన్ని ఖచ్చితమైన డేటా సేకరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సమగ్రమైన శిక్షణ ఇవ్వాలి. పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి, యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలి. కులగణన రాజకీయంగా సున్నితమైన అంశం కాబట్టి తప్పుడు సమా చారం ఇవ్వడానికి లేదా డేటాను తారుమారు చేయడానికి ఒత్తిడులు ఉండవచ్చు. డేటా సేకరణ ప్రక్రియను పారదర్శకంగా ఉంచడం, డేటా భద్రత గోప్యతను నిర్ధారించడం చాలా ముఖ్యం. రాజకీయ జోక్యాన్ని నివారించడానికి స్వతంత్ర సంస్థల పర్యవేక్షణను ఏర్పాటు చేయాలి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీనిని అధిగమించడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, దశలవారీగా గణన నిర్వహించడం, వనరులను తెలివిగా కేటాయించడం అవసరం. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కూడా ముఖ్యమైనది. కులగణన ఉద్దేశం, దాని సంభావ్య ఉపయోగాల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు తప్పుడు సమాచారం ఇవ్వవచ్చు లేదా సహకరించకపోవచ్చు. దీనిని అధిగమించడానికి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. మీడియా ప్రజా నాయకుల సహకారం తీసుకోవడం కూడా ఉపయోగపడుతుంది. చివరగా సేకరించిన కులాల డేటా గోప్యత, భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. డేటా లీక్ కావడం లేదా దుర్వినియోగం కావడం జరిగితే తీవ్రమైన పరిణామాలు ఉండవచ్చు. డేటా నిల్వ, నిర్వహణ కోసం కఠినమైన భద్రతా ప్రోటోకాల్‌లను అనుసరించాలి అధునాతన సాంకేతికతలను ఉపయోగించాలి. కులగణన సఫలం కావాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. స్పష్టమైన లక్ష్యాలు, పరిధిని నిర్దేశించడం, సమగ్రమైన ప్రణాళిక వ్యూహం రూపొందించడం, ఖచ్చితమైన వర్గీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, పారదర్శకత పాటించడం, డేటా గోప్యతను నిర్ధారించడం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం, నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం, క్రమానుగత పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కులగణన మరింత విజయవంతం కాగలదు. సామాజిక న్యాయం సమానత్వం సాధనలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# ఖనిజ ఒప్పందం ఎవరికి లాభం?




ఉక్రెయిన్‌లోని అపారమైన, అరుదైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవాలనుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎట్టకేలకు పైచేయి సాధించారు. అపురూప ఖనిజాలపై చైనా ప్రాభవానికి బ్రేకు వేయాలని ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక, రక్షణ రంగాలకు అవసరమయ్యే కీలకమైన, అపురూప ఖనిజాల్లో ప్రపంచం మొత్తం మీద 90% వరకు చైనాయే ఉత్పత్తి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందంపై గత కొంతకాలంగా ట్రంప్ పట్టుదలగా ఉండడం గమనార్హం. ఖనిజ తవ్వకాలకు ఒప్పందం కుదిరితేనే రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని నివారించడానికి, శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నిస్తానని పట్టుబట్టి తన పంతం నెగ్గించుకున్నారు. ఇక ఏం చేయాలో దిక్కుతోచక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తలవంచక తప్పలేదు. అయితే ఈ ఒప్పందం వల్ల రష్యా యుద్ధం ఆగిపోతుందా? ఖనిజాల తవ్వకాల నుంచి వచ్చిన నిధులు ఉక్రెయిన్ పునరాభివృద్ధికి ఉపయోగపడతాయా? ఆ మేరకు అమెరికా ప్రభుత్వం సహకరిస్తుందా? అన్న ప్రశ్నలకు ఇంకా సరైన సమాధానాలు లభించడం లేదు. ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇరుదేశాలు ప్రస్తుతం గోప్యంగానే ఉంచాయి. ఈ కొత్త ఒప్పందాన్ని 'యుఎస్ ఉక్రెయిన్ రీఇన్వెస్ట్‌మెంట్ ఫండ్' అని వ్యవహరిస్తున్నారు. ఖనిజ తవ్వకాలకు ఉక్రెయిన్ వీలు కల్పించినందున దానికి ప్రతిఫలంగా ఉక్రెయిన్ 'సంయుక్త పునర్నిర్మాణ పెట్టుబడి నిధిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిధికి ఉక్రెయిన్ అమెరికా చెరిసగం నిధులు సమకూర్చవలసి ఉంటుంది. ఈ ఒప్పందంలో ఏడు ముఖ్యమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. ఖనిజ వనరుల కోసం ఉమ్మడిగా అన్వేషణ చేయడం, ఉక్రెయిన్ అభివృద్ధికి పెట్టుబడులు ముమ్మరంగా ప్రవహింప చేయడం, ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పడం, పాత అప్పుల గురించి అడగకపోవడం, రష్యా పట్ల ముఖ్యంగా పుతిన్ పట్ల అమెరికా కఠిన వైఖరిని అవలంబించడం, ఖనిజ వనరుల లబ్ధి అమెరికా పొందినా కానీ యాజమాన్యం మాత్రం ఉక్రెయిన్ కిందే ఉండాలనడం, యూరోపియన్ యూనియన్‌లో చేరాలన్న ఉక్రెయిన్ చిరకాల స్వప్నానికి ఆటంకం కలగకుండా చూడడం అనే సంక్లిష్ట అంశాలు ఉన్నాయి. మరి వీటిలో ఏయే అంశాలకు అమెరికా సహకరిస్తుందో లేక తిరస్కరిస్తుందో చూడాలి.ముఖ్యంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల కఠిన వైఖరి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అవలంబించ గలుగుతారా? అన్నది మీమాంసే. ఉక్రెయిన్‌కు 350 బిలియన్ డాలర్లు ఇచ్చామని, ఆ సొమ్ము తిరిగి ఇవ్వాలని ట్రంప్ గతంలో డిమాండ్ చేశారు. కొత్త ఒప్పందం ప్రకారం ఆ డబ్బును తిరిగి ఉక్రెయిన్ ఇవ్వాలిన అవసరం లేనట్టు స్పష్టమవుతోంది. ఇప్పుడు ఉక్రెయిన్‌కు తాము ఇప్పటిదాకా ఇచ్చిన దాని కన్నా అధికంగా తిరిగి పొందబోతున్నామని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ ఒప్పందం వల్ల ఉక్రెయిన్‌కు రష్యా నుంచి కానీ మరే దేశం నుంచి యుద్ధాలు తలెత్తకుండా అమెరికా నుంచి పూర్తి భద్రత లభిస్తుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎంతో ఆశిస్తున్నారు. కానీ ఇప్పుడు కుదిరిన ఒప్పందంలో భద్రతపై గ్యారంటీ మాత్రం ప్రస్తావించలేదు. మరి భద్రతపై గ్యారంటీ లేని ఈ ఒప్పందాన్ని ఉక్రెయిన్ పార్లమెంట్ ఆమోదిస్తుందా? అన్న అనుమానం కలుగుతోంది. వాస్తవానికి యుద్ధంలో ఉక్రెయిన్‌కు ఎన్నో చిక్కులు వచ్చి పడుతున్నాయి. ట్రంప్ వచ్చిన తరువాత ఏమాత్రం భరోసా లభించడంలేదు. ఈ పరిస్థితుల్లో అమెరికా మద్దతు లేకుంటే సైనికులకు ప్రమాదం తప్పదు. గట్టి భద్రత ఉక్రెయిన్‌కు కల్పిస్తామన్న గ్యారంటీకి ట్రంప్ ఇష్టపడడం లేదు. పరిమిత ప్రయోజనాలతో ఉక్రెయిన్ చివరకు ఈ ఒప్పందానికి ఒప్పుకోక తప్పలేదు. ప్రపంచం మొత్తం మీద ఉండే ఖనిజాల్లో 5% ఉక్రెయిన్‌లోనే ఉండగా, ఉక్రెయిన్ ఖనిజ లోహాల నిల్వల్లో 40% ప్రస్తుతం రష్యా నియంత్రణలోనే ఉన్నాయి. ఇవన్నీ వినియోగం కాలేదు. ప్రపంచం మొత్తం మీద ఉండే గ్రానైట్‌లో 20% ఉక్రెయిన్‌లోనే ఉంది. అలాగే ప్రపంచం మొత్తం మీద మాంగనీస్ ఉత్పత్తుల్లో ఎనిమిదో స్థానం, టిటానియం ఉత్పత్తిలో 11వ స్థానంలో ఉక్రెయిన్ ఉంది. అరుదైన ఖనిజాలు ఆరు క్షేత్రాల్లో ఉన్నాయని, నోవో పోల్టావ్ స్కే వద్ద గనుల అభివృద్ధికి 300 మిలియన్ డాలర్లు అవసరమవుతాయని జెలెన్‌స్కీ గతంలో వెల్లడించారు. కీలకమైన ఖనిజాలు వంద కన్నా ఎక్కువ నిల్వలు ఉన్నాయని, టిటానియమ్, లిథియమ్‌తోపాటు 19 మిలియన్ టన్నుల గ్రాఫైట్ నిల్వలు ఉన్నాయని ఉక్రెయిన్ చెబుతోంది. అయితే 350 బిలియన్ డాలర్ల విలువైన గనులు రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లోనే ఉన్నాయని అంటోంది. కొన్ని సహజ వనరుల సమాచారం ప్రభుత్వ రహస్యంగా ఉంచడం సోవియెట్ తరం నాటి విధానంగా ఉంటోంది. గత ఏడాది సహజ వనరుల నుంచి 1.1 బిలియన్ డాలర్లనే రాయల్టీగా ఉక్రెయిన్ ప్రభుత్వం పొందగలిగింది. రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లో ఖనిజాల తవ్వకం చేపట్టాలంటే ముందు ఆయా భూభాగాల పొరల్లో నిక్షిప్తమై ఉన్న మందుపాతరలను చాకచక్యంగా నిర్మూలించవలసి ఉంటుంది. ఈ మేరకు ఖనిజాల అన్వేషణ, సర్వే వంటి వాటికి చాలా వ్యయప్రయాసలు భరించక తప్పదు. అంతమొత్తం ఖర్చు చేయడానికి, రిస్కు తీసుకోవడానికి అమెరికా ఎంతవరకు సిద్ధమవుతుందో తెలీదు. ఇదిలా ఉండగా రష్యా యుద్ధం మరోవంక సుదీర్ఘకాలం కొనసాగుతుంటే ఉక్రెయిన్ గనుల తవ్వకం చేపట్టడం సంక్లిష్టమవుతుంది. ఉక్రెయిన్ పట్టణాలు, నగరాలు, ముఖ్యంగా ముందు వరుసలో ఉన్న ప్రాంతాలు విధ్వంసంలో ఉన్నాయి. వాణిజ్య కార్యకలాపాలు అమెరికా ప్రారంభించే ముందు ఉక్రెయిన్ మౌలిక సౌకర్యాలు చెప్పుకోతగినంతగా పునరుద్ధరణ కావలసి ఉంది.

# ఎట్టకేలకు... కేంద్ర కుల గణన నిర్ణయం




జనాభా లెక్కల సేకరణలో కులగణననూ చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం బుధవారం నిర్ణయం తీసుకుంది. అసలు చేయకుండా ఉండడం కంటె ఆలస్యంగానైనా చేయడం మంచిది (లేట్ ఈజ్ బెటర్ దేన్ నెవర్) అన్న సామెత ఇందుకు సరిగ్గా సరిపోతుంది. ఎన్నో ఏళ్లుగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా ఎప్పటికప్పుడు ఏవేవో సాకులు చెప్పి దాన్ని తోసిపుచ్చుతూ వచ్చిన కేంద్ర పాలకులు ఇప్పటికి దేశవ్యాప్త కులగణనకు ఆమోదం తెలిపారు. సాధారణ జనగణనలో సేకరిస్తున్న షెడ్యూల్డు కులాలు, తరగతుల వారివి తప్ప ఇతర వెనుకబడిన తరగతులవారి వివరాలు ఆ విధంగా రావడంలేదు. వారికి సంబంధిచిన వాస్తవ సమాచారం అధీకృతంగా రావడం అవసరం. కులానికి, విద్యా సామాజికార్థిక అభివృద్ధికీ గల సంబంధాన్ని తెలుసుకోవడానికి కులగణన దోహదపడుతుంది. దేశ ప్రజలందరికీ సంబంధిచిన వివరాలన్నీ ఉంటేనే విధాన రూపకర్తలు అభివృద్ధికి తగిన ప్రణాళికలు, పథకాలు రూపొందించడం సాధ్యమవుతుంది. అంతేగాక ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రభావం వివిధ తరగతులపై ఎలా వుందన్నదీ విదితపడుతుంది. కాబట్టి శాస్త్రీయమైన రీతిలో ఎస్సీ ఎస్టీలతో సహా ఒబిసిల వివరాలతో దేశవ్యాప్త జన గణన నిర్వహించడం ఎంతో అవసరం. ఇప్పటికే బీహార్, కర్ణాటక, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు కులగణన చేపట్టాయి. ఆ వివరాలకున్న చట్టబద్ధతపై సందేహాలున్నా ఆయా రాష్ట్రాల్లో సంబంధిత కులాలకు చెందిన ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికవి దోహదపడ్డాయన్నది నిర్వివాదాంశం. దేశవ్యాప్తంగా కుల గణనకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం తమ విజయమేనని ప్రతిపక్షాలు ప్రకటనలు చేశాయి. కేంద్రాన్ని కులగణనకు తలొగ్గేలా చేయడంలో ఒకవిధంగా అవి సఫలీకృతమయ్యాయని భావించవచ్చు. తొలుత బీహార్‌లో కుల గణన జరగడానికి, ఇపుడు దేశవ్యాప్త కులగణనకు కేంద్రం ఒప్పుకోవడానికి ప్రతిపక్షాల ఆందోళనలు, విస్తృత ప్రజాభిప్రాయమూ పని చేశాయనిపిస్తోంది. కొన్ని రాష్ట్రాలు కులగణను రాజకీయ సాధనంగా వాడుకున్నాయని, కుల గణన నిర్ణయం కేంద్ర ప్రభుత్వం సమాజం, దేశ విలువలు, ప్రయోజనాలకు కట్టుబడి ఉందని నిరూపిస్తుందనీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పిన మాటలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. గడచిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ విషయం ఎవరు ప్రస్తావించినా ప్రతిపక్షాలు దేశంలో కులచిచ్చు పెడుతున్నాయని మోడీ-షా ద్వయం మొదలుకొని బిజెపి ఛోటా నాయకుల వరకూ ఎదురుదాడి చేసిన సంగతి ప్రజలకెరుకే! ఇన్నాళ్లూ తిరస్కరిస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఏ జ్ఞానోదయం కలిగి ఈ హఠాత్ నిర్ణయం తీసుకుందో అమాత్యవర్యులు సెలవివ్వలేదు. త్వరలో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు ఒక ప్రధాన కారణమని ఇప్పటికే చాలా కథనాలు వచ్చాయి. అంతేగాక పహల్గాం ఉగ్ర దాడి అనంతర పరిస్థితుల నేపథ్యం కూడా విస్మరించరానిదని ఇంకొన్ని విశ్లేషణలు వచ్చాయి. దేశంలో జనగణన 2021లో జరగవలసి వుంది. ఆ ప్రక్రియ 2020లోనే ప్రారంభం కావలసి వుండగా కోవిడ్ అనంతరం చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కోవిడ్ పోయి నాలుగేళ్లయినా జనగణన ఊసే లేకపోవడం కేంద్రం చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. వాస్తవానికి వలస పాలనాకాలం నుండి దేశంలో ప్రతి పదేళ్లకోసారి జనగణన జరుగుతోంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సైతం 1941 జనగణన కొన్ని పరిమితులతో నిర్వహించారు. స్వతంత్ర భారత దేశంలో ప్రతి దశాబ్దానికీ జనగణన సాగింది. నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వమే ఇలా వాయిదా వేస్తూ రావడం విచారకరం. గడచిన పదేళ్ల కాలంలో వివిధ గణాంకాలు, సర్వేల విషయంలో ఈ ప్రభుత్వ తీరు వేరుగా ఉంది. ఆయా గణాంక సేకరణలో ప్రాతిపదికల మార్పు గానీ వివిధ సర్వేల ఫలితాలను తొక్కిపట్టడం లేదా వక్రీకరించడం ఒక విధానంలానే సాగుతోంది. దాని కొనసాగింపుగానే 2021 జనగణన కూడా జాప్యం జరుగుతోందన్నది జనవాక్యం. ఇప్పుడు కులగణన చేయాలన్న నిర్ణయం వెలువడింది కనుక ఆలస్యం చేయకుండా దేశవ్యాప్త జనగణన చేపట్టడం అవశ్యం!





# ఒప్పో నుంచి అత్యంత పలుచని ఫోల్డబుల్ ఫోన్




ప్రపంచంలోనే అత్యంత పలుచనైన ఫోల్డబుల్ ఫోన్‌ను ఒప్పో లాంచ్ చేసింది. దీని పేరు 'ఒప్పో ఫైండ్ ఎన్ 5'. దీని మందం (ముడిచినప్పుడు) 8.93 మిల్లీమీటర్లు మాత్రమే.2024 విడుదలై అత్యంత పలుచని ఫోన్‌గా పేరు గాంచిన 'ఆనర్ మేజిక్ వి3' కంటే కూడా ఇది సన్నగా ఉంటుంది. ఫోన్‌ను తెరిస్తే దాని అత్యంత పలుచని పాయింట్ వద్ద 4.21 మిమీ మాత్రమే ఉంటుంది. దీనితో ప్రపంచంలోనే తమ ఫోన్ అత్యంత పలుచనైనదని సంస్థ ప్రకటించింది. సంస్థ ఈ ఫోన్‌ను మూసివేసినప్పుడు ఉండే కొలతల ఆధారంగానే క్రితం వారం విడుదలైన 'హువావే మేట్ ఎక్స్‌టి ట్రిపుల్ ఫోల్డబుల్ ఫోన్' అత్యంత సన్నగా ఉన్న ఫోన్ అవుతుంది. ఎందుకంటే దాని మందం 3.6 మిమీ మాత్రమే. 'ఒప్పో ఫైండ్ ఎన్5'ను గురువారం లాంచ్ చేశారు. అన్ని యూరోపియన్, ఆసియా మార్కెట్లలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, ఒప్పో తన 'ఫైండ్ ఎన్' సీరీస్‌ను ఇప్పటి వరకు భారత మార్కెట్‌లో విడుదల చేయలేదు కనుక తాజా ఫోన్ ఇక్కడ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో స్పష్టత లేదు. కాగా, 'ఒప్పో ఫైండ్ ఎన్5' ధర రూ. 1.62 లక్షలు ఉండే అవకాశం ఉంది.

**ఒప్పో ఫైండ్ ఎన్5 స్పెసిఫికేషన్లు, ఫీచర్లు :**

అమోలెడ్ డిస్‌ప్లేతో 6.62 అంగుళాల ఫుల్ హెచ్‌డి స్క్రీన్, ప్లస్ 8.1 అంగుళాల 2కె ఎక్స్‌టర్నల్ డిస్‌ప్లే, 120 హెర్జ్ ఎల్‌పిటిఒ రీఫ్రెష్ రేట్, 2160 హెర్జ్ పిడబ్ల్యుఎం డిమ్మింగ్, స్టైలస్ పెన్‌కు అనుకూలమైన డిస్‌ప్లేని తీర్చిదిద్దారు. ఈ ఫోన్ ఐపిఎక్స్6, ఎక్స్9 రేటింగ్‌లతో వస్తోంది. అంటే పూర్తి వాటర్ ప్రూఫ్, డస్ట్, డర్ట్ ప్రొటెక్షన్‌లు ఉన్నాయన్న మాట. సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ ఉన్న ఈ ఫోన్‌లో సరికొత్త క్వాల్‌కామ్ చిప్‌సెట్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలీట్‌ను ఉపయోగించారు. 16 జిబి, 512 జిబి స్టోరేజ్ కలిగి ఉంది. అదే విధంగా 5600 ఎంఎహెచ్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. ఇది 80 వాట్ల వైర్డ్ చార్జింగ్‌కు, 50 వాట్ల వైర్‌లెస్ చార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. అదే విధంగా 'ఒప్పో ఫైండ్ ఎన్5'లో ఫోటోలు, వీడియోల రికార్డింగ్ కోసం 50 మెగాపిక్సెల్ ప్రధాన సెన్సర్‌తో హాసెల్‌బ్లాండ్ బ్రాండెడ్ ట్రిపుల్ రియర్ కెమెరాను అమర్చారు. ఇందులో 8 మెగాపిక్సల్‌తో తెరచినప్పుడు ఒకటి, ముడిచినప్పుడు ఒకటిగా మొత్తం రెండు సెల్ఫీ కెమెరాలు అమర్చారు. కలర్ ఒఎస్ లేయర్‌తో లేటెస్ట్ ఆండ్రాయిడ్ వెర్షన్ 15ను ఉపయోగించారు. మిస్టీ వైట్, కాస్మిక్ బ్లాక్ డస్కీ పర్పుల్ రంగుల్లో ఫోన్ అందుబాటులో ఉంది.

# వాహనాలకు డిమాండ్ డౌన్



## ఫిబ్రవరి రిటైల్ అమ్మకాల్లో 7 శాతం క్షీణత
## ఫాడా వెల్లడి

న్యూఢిల్లీ: వాహనాలకు డిమాండ్ తగ్గిన నేపథ్యంలో ఫిబ్రవరిలో ప్యాసింజర్ వాహనాలు, టూ వీలర్లు సహా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు 7 శాతం క్షీణించినట్లు ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరిలో 20,46,328 వాహన విక్రయాలు నమోదు కాగా తాజాగా గత నెల 18,99,196 యూనిట్లకు తగ్గాయి. ప్యాసింజర్ వాహనాల రిటైల్ విక్రయాలు 10 శాతం క్షీణించి 3,03,398 యూనిట్లకు పరిమితమయ్యాయి. టూ వీలర్ల విక్రయాలు 6 శాతం క్షీణించి 14,44,674 నుంచి 13,53,280 యూనిట్లకు తగ్గాయి. వాణిజ్య వాహనాలు 9 శాతం క్షీణించి 82,763 యూనిట్లకు, ట్రాక్టర్ల విక్రయాలు 14 శాతం తగ్గి 65,574 యూనిట్లకు పడిపోయాయి. నిల్వలపరంగా సమతౌల్యత లేకపోవడం, ధరలపరంగా మార్పులు, వినియోగదారుల్లో బలహీన సెంటిమెంట్, ఎంక్వైరీలు తగ్గిపోవడం, రుణ లభ్యత పరిమిత స్థాయిలోనే ఉండటం తదితర అంశాలు అమ్మకాల క్షీణతకు కారణమైనట్లు ఫాడా పేర్కొంది.




ఎంట్రీ లెవెల్ కేటగిరీలో మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, కొనుక్కోవాలనుకునే ఆలోచన కొనుగోలు రూపం దాల్చడంలో జాప్యం జరుగుతుండటం, అలవికాని లక్ష్యాలు డీలర్లకు సమస్యాత్మకంగా ఉంటున్నాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. ఇదే విషయాన్ని తయారీ సంస్థలకు తెలియజేశారని, తమపై భారీ నిల్వల భారం మోపడాన్ని నివారించాలని కోరారని వివరించారు. మార్చిలో అమ్మకాలపై ఆశావహంగా ఉన్నప్పటికీ డీలర్లు కాస్త ఆచి తూచి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 50-52 రోజులకు సరిపడే నిల్వలు ఉంటున్నాయని పేర్కొన్నారు.

# టెక్ అంకురాల్లోనూ మహిళల హవా..!

## 26 బిలియన్ డాలర్ల సమీకరణ
## అమెరికా తర్వాత రెండో స్థానం
## దేశీయంగా 7 వేల పైచిలుకు మహిళల సారథ్యంలోని స్టార్టప్‌లు
## ట్రాక్షన్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: వినూత్న ఆవిష్కరణలతో ఆకటుకుంటున్న మహిళా స్టార్టప్‌లు, భారీ ఎత్తున నిధుల సమీకరణలోనూ సత్తా చాటుతున్నాయి. మహిళల సారథ్యంలోని అంకుర సంస్థలు ఇప్పటివరకు 26 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సమీకరించాయి. ఆల్‌టైమ్ ఫండింగ్ విషయంలో అమెరికా తర్వాత స్థానంలో నిల్చాయి. రీసెర్చ్, అనలిటిక్స్ సంస్థ ట్రాక్షన్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది.దీని ప్రకారం దేశీయంగా మహిళల సారథ్యంలోని అంకుర సంస్థల సంఖ్య 7,000 పైచిలుకు ఉంది. క్రియాశీలకంగా ఉన్న మొత్తం స్టార్టప్‌లలో వీటి వాటా 7.5 శాతం. ఇవన్నీ కలిసి ఇప్పటివరకు 26.4 బిలియన్ డాలర్లు సమీకరించాయి. 2021లో అత్యధికంగా 6.3 బిలియన్ డాలర్లు దక్కించుకున్నాయి. 2022లో అంతర్జాతీయంగా చూస్తే మహిళా స్టార్టప్‌లు మొత్తం మీద 32.8 బిలియన్ డాలర్లు సమీకరించగా .. దేశీ అంకురాలు 5 బిలియన్ డాలర్లతో 15.18% వాటా దక్కించుకున్నాయి.ఇక 2024లో అంతర్జాతీయంగా మహిళల సారథ్యంలోని స్టార్టప్‌లకు ఫండింగ్ విషయంలో 3.96% వాటాతో అమెరికా, బ్రిటన్ తర్వాత భారత్ మూడో స్థానంలో నిల్చింది.




ఈ స్టార్టప్‌లు భారీగా నిధులను సమీకరించడంతో పాటు పరిశ్రమలకు కొత్త నిర్వచనాన్ని ఇస్తూ, ఉద్యోగాలు కల్పిస్తూ, భవిష్యత్ ఎంట్రప్రెన్యూర్లకు కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తున్నాయని ట్రాక్షన్ పేర్కొంది. ఇవి మరింత వృద్ధిలోకి రావాల ంటే ఆర్థిక తోడ్పాటు, మెంటార్‌షిప్, వ్యవస్థాగతంగా మద్దతు లభించడం కీలకమని వివరించింది.

**నివేదికలోని మరిన్ని విశేషాలు..**

- రంగాలవారీగా చూస్తే రిటైల్ స్టార్టప్‌లు అత్యధికంగా 7.8 బిలియన్ డాలర్లు, ఎడ్‌టెక్ 5.4 బిలియన్ డాలర్లు, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ అంకురాలు 5 బిలియన్ డాలర్లు సమీకరించాయి. బిజినెస్ టు కన్జూమర్ ఈ-కామర్స్, ఇంటర్నెట్ ఫస్ట్ బ్రాండ్లు, ఫ్యాషన్ టెక్ అంకురాలు కూడా గణనీయంగా రాణిస్తున్నాయి.
- మహిళా స్టార్టప్‌ల సంఖ్యాపరంగా, అలాగే ఇప్పటి వరకు సమీకరించిన నిధులపరంగా బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ ఆ తర్వాత స్థానాల్లో నిల్చాయి.
- 2021లో మహిళల సారథ్యంలోని స్టార్టప్‌లలో అత్యధికంగా ఎనిమిది అంకురాలు యూనికార్న్‌లుగా ఎదిగాయి. 2019లో మూడు, 2020లో నాలుగు, 2022లో అయిదు ఈ హోదా సాధించాయి. అయితే, 2017, 2023, 2024లో ఒక్క యూనికార్న్ కూడా నమోదు కాలేదు.
- 2021లో మహిళా స్టార్టప్‌లు అత్యధికంగా 45 సంస్థలను కొనుగోలు చేశాయి. 2022లో ఇది 36కి, 2023లో 25కి, 2024లో 16కి తగ్గింది. 2024లో మహిళల సారథ్యంలోని అయిదు స్టార్టప్‌లు పబ్లిక్ ఇష్యూకి వచ్చాయి. మొబిక్విక్, ఉషా ఫైనాన్షియల్, తన్వాల్, ఇంటీరియర్స్ అండ్ మోర్, లాసీఖో వీటిలో ఉన్నాయి.

# స్మార్ట్ ఫోన్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం వల్ల ప్రయోజనాలు ఏంటి?

: చాలా మంది కొన్ని సంవత్సరాలుగా స్మార్ట్ ఫోన్‌ను వాడుతుంటారు. కొత్త మొబైల్ తీసుకున్న తర్వాత కంపెనీ అప్పుడప్పుడు కొత్త అప్‌డేట్‌లను విడుదల చేస్తుంటుంది. ఆ కంపెనీ పదే పదే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను విడుదల చేయడానికి కారణం ఏమిటి అనే ప్రశ్న మీ మనసులో ఎప్పుడైనా తలెత్తిందా? చాలా మంది మొబైల్ వినియోగదారులు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వచ్చిన వెంటనే అప్‌డేట్ చేస్తుంటే, కొంతమంది ఆ అప్‌డేట్‌ను విస్మరిస్తుంటారు. ఫోన్‌లో కొత్త అప్‌డేట్‌ను ఇన్‌స్టాల్ చేయడం వల్ల ఫోన్‌కు ప్రయోజనకరంగా ఉందా లేదా హానికరంగా ఉందా ? అని తెలుసుకోవడం ముఖ్యం. తద్వారా తదుపరిసారి అప్‌డేట్‌ను ఇన్‌స్టాల్ చేసే ముందు ఆ అప్‌డేట్ మీ ఫోన్‌ను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసా?



బగ్ పరిష్కారాల కోసం అప్‌డేట్స్: పాత ఆపరేటింగ్ సిస్టమ్‌లోని లోపాలు, బగ్‌ల కారణంగా కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు విడుదల చేస్తుంటుంది కంపెనీ. ప్రజల నుండి అభిప్రాయాన్ని స్వీకరించిన తర్వాత బగ్‌లు, లోపాలను తొలగించే కొత్త అప్‌డేట్‌ను విడుదల చేస్తుంటుంది. ఫోన్‌ని ఉపయోగిస్తున్నప్పుడు సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక సమస్యల కారణంగా చాలాసార్లు వినియోగదారులు కొన్ని సమస్యలను ఎదుర్కొంటారు. కొత్త అప్‌డేట్ తర్వాత వినియోగదారులు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారం అవుతుంది. తద్వారా ఆపరేటింగ్ సిస్టమ్‌తో వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచవచ్చు. బగ్‌లు, వివిధ సమస్యలతో పాటు వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందించడానికి కొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌కు కొత్త ఫీచర్లు జోడిస్తారని టెక్ నిపుణులు చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను డౌన్‌లోడ్ చేయడం వల్ల కలిగే ప్రతికూలత ఏమిటి?

సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసిన తర్వాత కొంతమంది వినియోగదారులు కొత్త అప్‌డేట్‌లో బగ్‌ల గురించి ఫిర్యాదు చేయడం లేదా కొంతమంది వినియోగదారులు ఫోన్‌లో కొత్త సమస్యను ఎదుర్కోవడం చాలాసార్లు గమనించే ఉంటారు. కొంతమంది కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను చూసిన తర్వాత కూడా దానిని విస్మరించడానికి ఇదే కారణం. కానీ ఇది ప్రతిసారీ జరగకపోవచ్చని, కంపెనీ నుంచి వచ్చిన అప్‌డేట్స్ వెంటనే చేయడం మంచిదంటున్నారు టెక్ నిపుణులు.







# ఈ వాచ్‌లతో మణికట్టుకు మరింత అందం.. అమెజాన్‌లో బెస్ట్ స్మార్ట్ వాచ్‌లు



మీ చేతి మణికట్టుకు అందాన్నిచ్చే స్మార్ట్ వాచ్ లలో ఆపిల్ వాచ్ ముందుంటుంది. సన్నని, తేలికపాటి, సౌకర్యవంతమైన డిజైన్ తో దీన్ని రూపొందించారు. పెద్ద డిస్ ప్లే కారణంగా సెట్టింగ్ లను చక్కగా చేసుకోవచ్చు. త్వరగా చార్జింగ్ అవ్వడం, 18 గంటల బ్యాటరీ బ్యాకప్, కాల్స్ మాట్లాడడం, సంగీతం వినడం, నోటిఫికేషన్లు చూసుకోవడం దీని ప్రత్యేకతలు, ముఖ్యంగా ఈ స్మార్ట్ వాచ్ ను ఉపయోగించి ఈసీజీ కూడా తీసుకోవచ్చు. రుతుచక్రం, హార్టుబీటుతో పాటు ఫాల్, క్రాష్ డిటెక్షన్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. ఈ వాచ్ ధరించిన వ్యక్తి పడిపోయినా, జారినా వెంటనే మెసేజ్ రూపంలో సమాచారం వెళుతుంది. అమెజాన్ తో రూ.38,999కి ఈ వాచ్ ను అందుబాటులో ఉంచారు.బోట్ కంపెనీ నుంచి విడుదలైన ఈ స్మార్ట్ వాచ్ లో 5.10 సెంటీమీటర్ల హెచ్ డీ డిస్ ప్లే ఆకట్టుకుంటోంది. స్పష్టమైన విజువల్స్, సులభమైన నావిగేషన్ ను అందిస్తుంది. ఇంటిలోనూ, బయట కూడా చక్కగా వినియోగించుకోవచ్చు. టర్న్ బై టర్న్ నావిగేషన్, ఏడు రోజుల బ్యాటరీ బ్యాకప్, దుమ్ము, చెమట నుంచి రక్షణ వ్యవస్థ, గేమ్ లు, వ్యాయామం కోసం 700 పైగా యాక్టివ్ మోడ్ లు దీనిలో ఉన్నాయి. సుమారు 2 గంటల్లో బ్యాటరీని చార్జింగ్ చేసుకోవచ్చు. అమెజాన్ లో దీని ధర రూ.1.999 మాత్రమే.బోట్ బ్రాండ్ నుంచి విడుదలైన ఎక్స్ టెండ్ సిరీస్ స్మార్ట్ వాచ్ లో 1.69 అంగుళాల ఎల్సీడీ డిస్ ప్లే ఏర్పాటు చేశారు. దీని ద్వారా సమయాన్ని స్పష్టంగా చూడడంతో పాటు సెట్టింగ్ లలో సర్దుబాట్లు కూడా చక్కగా చేసుకోవచ్చు. అంతర్నిర్మిత అలెక్సా వాయిస్ అసిస్టెంట్ చాలా ఉపయోగంగా ఉంటుంది.



ఏడు రోజుల బ్యాటరీ బ్యాకప్, ఫిట్నెస్ ట్రాకర్, పెడో మీటర్, క్యాలెండర్, అలారం తదితర ఫీచర్లు ఉన్నాయి. దీనిలోని యాంబియంట్ లైట్ డిస్ ప్లే కారణంగా వాచ్ లైటింగ్ బయటి వాతావరణానికి అనుగుణంగా మారుతుంది. సుమారు రెండు గంటల్లో బ్యాటరీ ఫుల్ చార్జింగ్ అవుతుంది. అమెజాన్ లో రూ.1799కి ఈ వాచ్ అందుబాటులో ఉంది.ఆండ్రాయిడ్, ఐవోఎస్ ఆపరేటింగ్ సిస్టమ్ పై ఫాసిల్ స్మార్ట్ వాచ్ పనిచేస్తుంది. మాగ్నెటిక్ డాక్ స్నాప్ లతో కూడిన యూఎస్ బీ డేటా కేబుల్ ద్వారా చార్జింగ్ చాలా త్వరగా చేసుకోవచ్చు. నిద్ర, గుండె వేగం, రక్త ఆక్సిజన్ తదితర వాటిని ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేసుకోవచ్చు. అత్యంత తేలికైన ఈ వాచ్ బ్యాటరీ జీవితం 24 గంటలు. లిథియం - అయాన్ బ్యాటరీ, స్టెయిన్ లెస్ స్టీల్ మెటీరియల్, బ్లూటూత్ కనెక్టివిటీ అదనపు ప్రత్యేకతలు. ఈ వాచ్ ను అమెజాన్ లో రూ.12,498కి కొనుగోలు చేయవచ్చు. సామ్సంగ్ నుంచి విడుదలైన ఈ వాచ్ పురుషులకు బాగా నప్పుతుంది. దీనిలో 1.47 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్ ప్లే ఏర్పాటు చేశారు. ప్రకాశవంతమైన కాంతిలో కూడా చ్ఛాలా స్పష్టంగా అక్షరాలు కనిపిస్తాయి. 3 ఎన్ఎం ప్రాసెసర్ తో బ్యాటరీ జీవితాన్ని తెలుసుకోవచ్చు. బయోయాక్టివ్ సెన్సార్ మీకు ఆరోగ్యం, ఫిట్ నెస్ విషయాలను అందిస్తుంది.డ్యూయల్ జీపీఎస్ ఫీచర్ తో లోకేషన్ ను క్రాకింగ్ చేసుకోవచ్చు. కెమెరా, కాల్స్, పాల్ డిటెక్షన్ తదితర ఫీచర్లు ఉన్నాయి. ఈ వాచ్ ను అమెజాన్ లో రూ.32,499కి కొనుగోలు చేయవచ్చు.





# సినిమా చిత్రం



సౌత్‌లో పాపులరై, బాలీవుడ్ ని ఏలాలని కలలు గంది ప్రగ్య జైశ్వాల్. ఈ బ్యూటీ ఇటీవల కొంతకాలంగా ముంబైలో సెటిలైంది. అక్కడ తన స్నేహితురాళ్లు మంచు లక్ష్మీ ప్రసన్న, రకుల్ ప్రీత్ లతో కలిసి కెరీర్ వేటలో బిజీ బిజీగా ఉంది. ఇదే సమయంలో హైదరాబాద్ కనెక్షన్స్ ని ప్రగ్య విడిచిపెట్టడం లేదు. తెలుగు పరిశ్రమలో అంది వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ఈ భామ ఇప్పటికే చాలా దూరం ప్రయాణించింది. పోరాటం సాగించింది. దశాబ్ద కాలంగా అనుకున్నది సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. టాలీవుడ్ లో తనదైన ముద్ర వేయాలని తపించిన ఈ భామ కొన్ని అరుదైన అవకాశాలను అందుకుంది. ఆరంభం కంచెలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రను అందుకుంది. వరుణ్ తేజ్ డెబ్యూ మూవీకి ప్రగ్య ప్రధాన ఆకర్షణగా మారింది. కానీ ఆ తర్వాత దానిని మరో స్థాయికి తీసుకెళ్లాల్సి ఉండగా, అగ్ర హీరోల సినిమాల్లో గ్లామరస్ పాత్రలకు పరిమితమైంది. ఎన్నీకే సరసన అఖండ, డాకు మహారాజ్ లాంటి భారీ చిత్రాలలో నటించిన ప్రగ్య జైశ్వాల్,

## మైండ్ బ్లాక్ చేసిన ప్రగ్య బ్యాక్ లెస్ ఫోజ్



సల్మాన్ తో కిసీ కా భాయ్... లాంటి పరిధి తక్కువ ఉన్న పాత్రల్లో మెరిసింది. బాలయ్యతో రెండు సినిమాలు కమర్షియల్ విజయాలు అందుకున్నా బోల్డ్ పెర్ఫామర్ గా తన గుర్తింపును పరిమితం చేసాయి. తన ఎంపికల గురించి నిజాయితీగా అంగీకరించే ప్రగ్య జైశ్వాల్ తదుపరి మరో పెద్ద అవకాశం కోసం ప్రయత్నిస్తోంది. ఈ గ్యాప్ లో అభిమానులకు సోషల్ మీడియాల ద్వారా టచ్ లో ఉంది. ప్రగ్య నిరంతర బోల్డ్ ఫోటోషూట్లు ఇన్‌స్టాలో వైరల్ గా దూసుకెళుతున్నాయి. తాజాగా ఈ భామ బ్యాక్ లెస్ ఫోజ్ లో చెలరేగిపోయిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.




ప్రగ్య ఖరీదైన బ్లేజర్ ధరించి, తనదైన స్టైల్ లో వీపందం ప్రదర్శించింది. చూపులు తిప్పుకోనివ్వని ఈ లుక్ కుర్రకారు గుండెల్ని మరిగిస్తోంది. అఖండ 2 , టైసన్ నాయుడు లాంటి భారీ చిత్రాల్లో ప్రగ్య నటిస్తోంది.

## ది ప్యారడైజ్ స్టన్నింగ్ లుక్.. వైల్డ్ నాని వెనక్కి తగ్గేలా లేడు

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ది ప్యారడైజ్. మ్యాడ్ మ్యాక్స్ స్టైల్ షేడ్స్‌తో మిక్స్ చేసిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాపై మొదటి నుంచి ఆసక్తి నెలకొంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని మేకర్స్ భారీ స్థాయిలో ప్లాన్ చేస్తుండటంతో, ప్రతి చిన్న అప్డేట్ మీదా ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ప్రత్యేక ఉత్కంఠ నెలకొంటోంది. లేటెస్ట్ గా విడుదలైన నాని లుక్ పోస్టర్ ఆ ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. మిషన్ గన్ తో, వీరుడిలా ముక్తంగా వర్షాన్ని తట్టుకుని నిలబడి ఉన్న నాని లుక్ సినిమాపై ఊహించని ఇంటెన్సిటీని పెంచింది. ఈ విజువల్స్‌కి వెండితెరపై హై వోల్టేజ్ వైబ్ ఇవ్వడం గ్యారెంటీ. 1980ల కాలాన్ని బేస్‌గా తీసుకుని మ్యాడ్ మ్యాక్స్ శైలిలో తెరకెక్కుతోన్న ఈ మూవీకి విజువల్ మాసివ్ ఎక్స్‌పీరియన్స్ అనే ట్యాగ్ ఇప్పటికీ చక్కగా సెట్ అయ్యింది. %సూశ్రీంశీ =ఝుం - నా2జు%: సినిమా టోటల్ బడ్జెట్ ఎంతంటే.. ఈ సినిమాను ప్రొడక్షన్ పరంగా ఎంతో గ్రాండ్‌గా డిజైన్ చేస్తున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి ఇద్దరూ సినిమా విజువల్ రిచ్‌గా ఉండేలా ఎక్కువ బడ్జెట్‌ను కేటాయించినట్లు సమాచారం.

బజ్ ప్రకారం ఈ సినిమా బడ్జెట్ సుమారు 110-120 కోట్లు వరకు ఉండే అవకాశం ఉంది. అన్ని భాషల్లో విడుదలవుతుండటంతో బిజినెస్ పరంగా కూడా భారీ ఆశలు పెట్టుకున్నారు. నాని ఇంతవరకు చేసిన సినిమాల్లో ఇదే అతిపెద్ద బడ్జెట్ ప్రాజెక్ట్ అవుతుందని టాక్. అయితే ఇటీవల ఓ



గాసిప్ హల్‌చల్ చేసింది. ఈ చిత్రం రిలీజ్ డేట్‌గా ప్రకటించిన 2026 మార్చి 26న మరో బడా ప్రాజెక్ట్.. రామ్ చరణ్-బుచిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా కూడా విడుదల కావచ్చని ప్రచారం జరిగింది. అంతే కాదు, అదే వారానికి ముందు రణ్‌బీర్ కపూర్ లవ్ అండ్ వార్, యశ్ 'టాక్సిక్' సినిమా కూడా రిలీజ్ కావడం వల్ల నాని తమ రిలీజ్ డేట్‌ను మార్చవచ్చునని చర్చ మొదలైంది. ఈ పోటీలో నిలబడటం కష్టమైపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే మేకర్స్ ఆ గాసిప్స్‌కు నేటితో ఫుల్ స్టాప్ పెట్టారు. ఇంకా 365 రోజులు అంటూ నాని కొత్త పోస్టర్‌తో పాటు రిలీజ్ డేట్‌ను మరోసారి గుర్తు చేస్తూ అఫీషియల్‌గా 26.3.26 అని ప్రకటించారు. అంటే, ప్యారడైజ్ పోటీలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టమైంది. ఈ పోస్టర్ చూసిన తర్వాత నాని లుక్‌కి మెచ్చిపోయిన నెటిజన్లు నాని షాక్ ఇచ్చేలా ఉన్నాడు.. యాక్షన్‌తో మాస్ మసాలా ప్యారడైజ్ బాంబ్.. ఈసారి వైల్డ్ బాడితో అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తంగా చెప్పాలంటే, ప్యారడైజ్ నాని కెరీర్‌లోనే ఒక డిఫరెంట్ స్టెప్ అవుతుందని ఈ పోస్టర్ మరోసారి స్పష్టం చేసింది. రిలీజ్ డేట్‌పై గాసిప్స్ వచ్చినా, మేకర్స్ క్లారిటీ ఇచ్చారంటే సినిమా మీద ఎంత నమ్మకంతో ఉన్నారో అర్థం అవుతుంది. మరి, ఈ యాక్షన్ ఫెస్టివల్ ఎలా ఉంటుందో వచ్చే అప్డేట్స్ ను బట్టి అర్థమవుతుంది.

## మామ- అల్లుడుకి 2025 భలే కలిసొచ్చిందే!



2025 మామ-అల్లుడి కెరీర్ లో గొప్ప ఏడాదిగా మిగిలి పోతుందా? జీవితాంతం గుర్తు పెట్టుకునే గొప్ప సంవత్సరమా? అంటే అవుననే అనాలి. ఇంతకీ ఎవరా మామా అల్లుడు. ఏంటి వారి ప్రత్యేకత అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. వాళ్లే విక్టరీ వెంకటేష్..అక్కినేని వార సుడు నాగచైతన్య. విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన -సంక్రాంతికి వస్తున్నాం -% పండగ సీజన్లో రిలీజ్ అయి ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. / వెంకటేష్ కెరీర్ లోనే తొలి సెంచరీ నమోదు చేయడమేగాకుండా ఆయన్ని ఏకంగా 300 కోట్ల క్లబ్ లో చేర్చింది. ఒక్క విజయం తో ఏకంగా చిరంజీవి, బాలయ్య, నాగార్జున లాంటి స్టార్లనే వెంకీ వెనక్కి నెట్టేసారు. అప్పటి వరకూ వెంకీ సినిమాలంటే 60-70 కోట్లు రావడం కూడా కష్టం ఉండేది. వెంకటేష్ తో సినిమా అంటే? మార్కెట్ పరంగా ఎన్నో అంశాలు పరిగణలోకి తీసుకోవాల్సి వచ్చేది.కానీ ఒక్క విజయంతో వెంకటేష్ స్టార్ డమ్ మూడింతలు రెట్టింపు అయింది. దీంతో ఆయన పారితోషికం కూడా భారీగా పెరిగింది. ఇక అల్లు నాగాచైతన్య కూడా - తండేల్ - తో 100 కోట్ల క్లబ్ లో కి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. రిలీజ్ కి ముందే సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. చైతన్య తొలి పాన్ ఇండియా రిలీజ్ కావడంతో? అతడు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూసాడు. రిలీజ్ అనంతరం అతడి నమ్మకం నిలబడింది. ఇప్పటి వరకూ చైతన్య చాలా సినిమాలు చేసాడు. కానీ ఏవీ 80 కోట్లు వసూళ్ల టి వరకూ చైతన్య చాలా సినిమాలు చేసాడు. కానీ ఏవీ 80 కోట్లు వసూళ్లుదాటలేదు. - తండేల్ - ఏకంగా 100 కోట్లకు పైగా వసూళ్లు తేవడంతో అతడి ఆనందానికి అవధుల్లేవ్. ఈ సినిమా విజయం విషయంలో నాగార్జున ఎంత సంతోషంగా ఉన్నారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. అలా వెంకీ-చైతన్య 2025లో సెంచరీలో నమోదు చేసారు.

## ఎన్టీఆర్ మూవీ వాయిదా... నీల్ పబ్లిసిటీ స్టంటా?





ఎన్టీఆర్ ప్రస్తు తం 'దేవర'ను జపాన్‌లో ప్రమోట్ చేస్తున్నాడు. గత మూడు రోజులుగా ఎన్టీఆర్ అక్కడ బిజీ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే వేసిన పలు ప్రివ్యూ షో లకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. దాంతో దేవర సినిమాను భారీ ఎత్తున జపాన్‌లో విడుదల చేయబోతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ తదుపరి సినిమాను ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో చేస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమాకు డ్రాగన్ అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారనే వార్తలు వస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం డ్రాగన్ సినిమాను ప్రశాంత్ నీల్ ప్రారంభించాడు. భారీ యాక్షన్ సన్నివేశంను ఎన్టీఆర్ లేకుండానే షూట్ చేశాడు. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో డ్రాగన్ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. త్వరలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించబోతున్నారు. ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబోలో మూవీ కోసం దాదాపు ఐదేళ్లుగా అభిమానులు ఎదురు చూస్తున్నారు. కేజీఎఫ్, సలార్ సినిమాలతో ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా స్టార్ దర్శకుడిగా మంచి గుర్తింపు దక్కించుకున్నాడు. అందుకే ఎన్టీఆర్‌తో చేస్తున్న డ్రాగన్ సినిమాకు అంచనాలు భారీగా ఉన్నాయి. సినిమా షూటింగ్ ప్రారంభించకుండానే ఎన్టీఆర్ డ్రాగన్ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ నీల్ అధికారికంగా ప్రకటించాడు. కానీ తాజాగా సినిమా సంక్రాంతి బరి నుంచి తప్పుకుందనే వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ వంటి పెద్ద స్టార్‌తో భారీ బడ్జెట్ సినిమాను తీయాలని అనుకున్నప్పుడు కనీసం ఏడాది మేకింగ్‌కే పడుతుంది. అలాంటప్పుడు ఎలా ప్రశాంత్ నీల్ ఈ సినిమాను 2026 జనవరిలో విడుదల చేస్తామని ప్రకటించాడని ప్రశ్నిస్తున్నారు. మరికొందరు మాత్రం ఇది అంతా పబ్లిసిటీ స్టంట్ అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ కేజీఎఫ్ సినిమా నుంచి తీసుకుంటే ప్రతి సారి వాయిదా వేస్తూ వచ్చాడు. కేజీఎఫ్ 2తో పాటు సలార్ 1 ను వాయిదాలు వేసిన తర్వాతే విడుదల చేశాడు. సలార్ 2 ను ఎప్పుడు విడుదల చేసేది క్లారిటీ ఇవ్వడం లేదు. ఎప్పటికి సినిమాను విడుదల చేసేది ప్రశాంత్ నీల్ నుంచి స్పష్టత లేకపోవడంతో ప్రభాస్ అభిమానులు జుట్టు పీక్కుంటున్నారు. సలార్ 2 గురించి ఎలాంటి అప్డేట్ లేకుండానే ఎన్టీఆర్ డ్రాగన్‌ను సంక్రాంతికి అంటూ ప్రశాంత్ నీల్ నుంచి వచ్చిన ప్రకటనను చాలా మంది విశ్వసించలేదు. ఎన్టీఆర్ అభిమానులు ఆశలు పెట్టుకున్నా ఎక్కువ శాతం మంది ఆ తేదీకి ఎన్టీఆర్ సినిమా రావడం అంటే కచ్చితంగా అద్భుతం అనే అభిప్రాయంను వ్యక్తం చేశారు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సినిమాను జనవరి బరి నుంచి తప్పించడానికి విజయ్ జన నాయగన్ అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ షూటింగ్ లో జాయిన్ కాలేదు. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు, పాటలు, కీలక టాకీ పార్ట్ షూటింగ్ చేయాల్సి ఉంది. ఇంత షూటింగ్ ఉండగా జనవరిలో సినిమాను విడుదల చేయడం సాధ్యం కాదని ప్రశాంత్ నీల్‌కి తెలుసు. అయినా ఆయన పబ్లిసిటీ కోసమే ఇలా సినిమాల విడుదల తేదీలను ప్రకటిస్తాడు అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. అసలు విషయం ఏంటి అనేది ఆ ప్రశాంత్ నీల్‌కే తెలియాలి. ఈ సినిమా కొత్త విడుదల తేదీ ఎప్పుడు అనేది చూడాలి.

## మిరాయ్.. ఇదేం మ్యాజిక్ సజ్జా!

తెలుగు సినిమాల్లో చిన్న సినిమాలు పెద్ద సినిమాల్లా మారిపోతున్న ట్రెండ్‌కు తాజా ఉదాహరణగా నిలుస్తోంది 'మిరాయ్'. తేజా సజ్జా హీరోగా వస్తున్న ఈ సూపర్ యోధ కథపై, అఫిషియల్ టీజర్ రాకముందే ఓ మోస్తరు బజ్ కలగడమేకాదు, బుక్ మై షో లో 25 వేల మందికి పైగా ఇంటరెస్ట్ చూపించడం సినీ పరిశ్రమను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇది ప్రమోషన్లు లేకుండా వచ్చిన ప్రీ రిలీజ్ హైప్ అనడం అతిశయోక్తి కాదు. / ఈరోజుల్లో పెద్ద హీరోల సినిమాలు సైతం రిలీజ్ తేదీ దగ్గర పడినా ఆసక్తిని రేపలేక పోతున్న తరుణంలో, ఓ చిన్న హీరో చేస్తున్న సినిమా ఇలా దూసుకుపోతుండటం వెనుక ఓ స్ట్రాంగ్ కాన్సెప్ట్, మంచి టైటిల్, అలాగే సైలెంట్ కానీ మార్మోగేలా డిజైన్ చేసిన ప్రెజెంటేషన్ ఉంది. గతేడాది రిలీజ్ అయిన టైటిల్ గ్లింప్స్‌లోనే ఇది సాధారణ సినిమా కాదన్న ముద్ర పడిపోయింది. అంతే కాదు, అప్పటి నుంచే 'ఇది వేరే లెవెల్ మూవీ అయిపోతుంది' అన్న నమ్మకం మొదలైంది. తేజా సజ్జా క్రేజ్ కు మరొక ముఖ్య కారణం 'హనుమాన్'. ఆ సినిమా తో అతను పెద్దగా ప్రమోషన్స్ లేకుండానే బ్లాక్ బస్టర్




కొట్టేశాడు. ఇప్పుడు ఆ రూట్లోనే మిరాయ్ కూడా సైలెంట్ గానే తన మార్క్ ను చూపెడుతోంది. తక్కువ ఖర్చుతో, అధిక నమ్మకంతో చేసిన సినిమా ఎలా హైప్ క్రియేట్ చేయాలో చూపించిన 'హనుమాన్' తరహా హిట్, మళ్లీ రిపీట్ కావొచ్చన్న టాక్ ఇండస్ట్రీలో స్పష్టంగా వినిపిస్తోంది. సినిమాలో ఏ పాత్రలు ఎలా ఉంటాయో అధికారికంగా బయటకు రాకపోయినా, 'సూపర్ యోధ' కాన్సెప్ట్ చుట్టూ మలచిన ప్రెజెంటేషన్ ఒక అడుగు ముందే ఉంది. సాధారణ సూపర్ హీరోలతో పోల్చుకుంటే మిరాయ్ ఓ ప్రాచీన భావనతో మిక్స్ చేసిన కథగా వుంటుందనే ఊహలు ఇప్పటికే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వీటికి తోడు, తేజా ఎంచుకుంటున్న స్క్రిప్ట్ లైన్ చాలా ఇంట్రెస్టింగ్ గానే ఉండటం వల్ల ప్రేక్షకుల్లో ఈ ఫిల్మ్ పై ఒక ఆసక్తి పెరుగుతోంది. ఇక మిరాయ్ 2025లో బాక్సాఫీస్ వద్ద సైలెంట్ గానే వచ్చి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అన్నది హాట్ టాపిక్ గా మారింది. 'ద రాజాసాబ్', 'వార్ 2' లాంటి పెద్ద సినిమాల మధ్య ఓ చిన్న హీరో సినిమా ఇలా తన స్థానం సంపాదించుకోవడం మామూలు విషయం కాదు. ఇది ఇండస్ట్రీలో కథల ఆధారిత విజయాలకు మార్గం చూపించగల శుభ సంకేతంగా కూడా చెప్పొచ్చు. అయితే టీజర్ విడుదలయ్యాక ఈ హైప్ నిలబడుతుందా? పెరుగుతుందా అనేది మరో కీలకం విషయం. మరి తేజా సజ్జా కష్టానికి అదృష్టం ఎంతవరకు సహకరిస్తుందో చూడాలి.

## 100కోట్ల డిజాస్టర్ తరువాత మరో లక్కీ ఛాన్స్?



సౌత్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్‌కు బాలీవుడ్ ఎంట్రీ పెద్ద నిరాశను మిగిల్చింది. అట్లీ దర్శకత్వం వహించిన తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి' ఆధారంగా తెరకెక్కించిన హిందీ చిత్రం బేబీ జాన్. అయితే ఈ సినిమా ద్వారా ఆమె హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఇందులో ఆమెకు వన్ ఆఫ్ ది లీడ్ పాత్రే అయినా, సినిమా ఫెయిల్యూర్‌తో పాటు ఆమె నటన కూడా విమర్శలు ఎదుర్కొంది. / వరుణ్ ధవన్, జాకీ ష్రాఫ్ లాంటి స్టార్‌లతో కూడిన భారీ బడ్జెట్ మూవీ అయినా, కేవలం రూ.39.28 కోట్లే వసూలు చేయడం అందరికి షాక్ ఇచ్చింది. ఇక దాదాపు రూ.160 కోట్ల బడ్జెట్ ఉన్న ఈ చిత్రానికి భయంకరమైన లాస్ కలిగించింది. ముఖ్యంగా కీర్తి సురేష్ పోషించిన డాక్టర్ మీర వర్మ పాత్ర ప్రేక్షకులలో ఎమోషనల్ కనెక్షన్ రాకపోవడం గమనార్హం. ఆమె నటనపై కూడా విమర్శలు వచ్చాయి. మహానటితో మెప్పించిన ఆమె ఈ సినిమాలో మెరుగ్గా కనిపించలేదన్న అభిప్రాయం స్పష్టంగా వ్యక్తమైంది. ఈ నేపథ్యం చూస్తే, బాలీవుడ్‌లో ఆమె ప్రయాణం ప్రారంభమవకముందే ముగిసినట్టేనా అనే అనుమానాలు కలుగడం సహజం. గతంలో కొంతమంది సౌత్ బ్యూటీలు బాలీవుడ్ లో క్లిక్కయిన కూడా ఎక్కువ కాలం నిలవలేదు. అలాంటిది ఫస్ట్ సినిమాకే 100 కోట్లు నష్టాలు రావడంతో అమ్మడిపై ఎవరు ఫోకస్ చేయరని కథనాలు వచ్చేశాయి. కానీ తాజాగా వస్తున్న ఓ వార్త మాత్రం ఆమె కెరీర్ పై కొత్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్‌తో కీర్తి కలిసి నటించే అవకాశం ఉందట. ఇది తుది అఫీషియల్ కాకపోయినా, ఇందుకు సంబంధించి బాలీవుడ్ వర్గాల్లో చర్చ సాగుతోందని సమాచారం. రణబీర్ కపూర్ ప్రస్తుతం లవ్ అండ్ వార్, రామాయణం, ధూమ్ 4 వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా, ఒక కొత్త ఎమోషనల్ లవ్ స్టోరీ కోసం నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారని టాక్.

### ఆ ప్రాజెక్ట్‌కి కీర్తి ఎంపిక కావడం జరిగితే, ఆమెకు :

సినిమా టోటల్ బడ్జెట్ ఎంతంటే.. ఆ ప్రాజెక్ట్‌కి కీర్తి ఎంపిక కావడం జరిగితే, ఆమెబాలీవుడ్‌లో రెండో అవకాశం లభించనుంది. ఈసారి మాత్రం బలమైన స్క్రిప్ట్, మల్టీ లేయర్డ్ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశముంది. దక్షిణాదిలో తన ప్రూవన్ స్కిల్స్ ఉన్నప్పటికీ, బాలీవుడ్ ప్రేక్షకులకు కీర్తి సురేష్ నటన సరైన కాన్వాస్‌లో చూపించాల్సిన అవసరం ఉంది. రణబీర్ లాంటి వెర్సటైల్ నటుడితో కలిసి నటించడం ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తే ఆశ్చర్యం లేదు. ఇక బాలీవుడ్‌లో ఆమె మళ్లీ బౌన్స్ బ్యాక్ అవుతుందో లేదో చూడాలి.

Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555